RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY	తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 229 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం, మార్చి,7, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 229 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday, March,7, 2026 | PAGES : 8 RS : 4 /- |




## ఛత్తీస్‌ఘడ్‌లో ప్రైవేట్ బస్సు బోల్తా ఐదుగురు ప్రయాణికుల మృతి

**రాయ్‌పూర్,మార్చి6:** ఛత్తీస్‌గఢ్ లోని జాష్‌పూర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మరికొన్ని గంటల్లో తమ గమ్య స్థానం చేరుకు ంటామనే లోపు మృత్యు ఒడిలోకి చేరుకు న్నారు. ఒక ప్రైవేట్ బస్సుబోల్తా పడటంతో ఐదు గురుమృతి చెందగా, 20 మంది గాయ పడ్డారని పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను దగ్గరలోని ఆస్పత్రులకు తరలించారు.



# ఇరాన్‌తో యుద్ధం..

## రోజుకు రూ.8,000 కోట్లు ఖర్చు చేస్తున్న అమెరికా..!

**న్యూఢిల్లీ,మార్చి,6:** ఏ రెండు దేశాల మధ్య యుద్ధమై నా.. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ఇరువై పులా భారీ నష్టం ఉంటుంది. అందులోనూ యుద్ధం కోసం భారీగా నిధులు ఖర్చు చేయాలి. యుద్ధాల కారణంగా కొన్ని దేశాలు ఆర్థికంగా చితికిపోయాయి కూడా. ఇప్పుడు ఇదంతా ఎందుకూ అంటే ప్రస్తుతం జరుగుతున్న ఇరాన్ యుద్ధం కోసం అమెరికా భారీగా ఖర్చు పెడుతున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. దీనికి సంబంధించి అధికారిక సమాచారం బయటకు రాదు. కానీ, అమెరికాలోని వాషింగ్టన్‌కు చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐఎస్) అనే సంస్థ నివేదిక ప్రకారం అమెరికరా ఈ యుద్ధం కోసం భారీగా ఖర్చు చేస్తోంది. శుక్రవారం నాటికి ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమై వారం రోజులు అవుతోంది. ఇన్ని రోజులు యుద్ధంపై చేసిన ఖర్చుపై అంచనాల్ని ఈ నివేదిక వెల్లడించింది. యుద్ధం మొదలైన మొదటి 100 గంటల్లోనే అమెరికా 3.7 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అలాగే ఈ వారం రోజులపాటు సగటున రోజుకు 900 మిలియన్ డాలర్లు ఖర్చైంది. అంటే మన కరెన్సీలో రోజుకు రూ.8,300 కోట్ల వరకు ఖర్చ వుతోంది.

# ప్రజల మద్దతుతో... పాలన సాగిస్తున్నాం...



- మీ అందరి మద్దతుతనే గెలిచాం
- మాటలు, మూటలతో గెలిచి రాలేదు
- మా వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదు
- వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మద్దుతగా నిలిచా
- మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో రేవంత్

**హైదరాబాద్,మార్చి6,తెలంగాణ దిశ :** చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లా యిస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజ రయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడు తూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వ మని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. తమది పే దల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారం లోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గు ర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పో యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుం చీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. కర్ణుడి మాదిరిగా మిత్రధర్మానికి కట్టుబడి మాది గల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వర్గీక రణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీ వైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా గుర్తు చేశా రు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు.



# తెలంగాణా సహా 22 రాష్ట్రాల్లో 'సర్'

## - నోటిఫికేషన్ జారీ చేసిన ఈసీ..

**హైదరాబాద్,మార్చి,6,తెలంగాణ దిశ :** తెలంగాణాలో "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్" 'సర్' కు రంగం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర న్నికల సంఘం (సీఈసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. నకిలీ ఓటర్లను తొలగిం చి, ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు ఉద్దేశంలో 'సర్' తీసుకొచ్చింది కేంద్ర ఎ న్నికల సంఘం. దీనిలో భాగంగా తెలంగాణతో సహా 22 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌కు నోటి ఫికేషన్ జారీ అయ్యింది. ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐఆర్)కు సంబంధించి సన్నాహకాలను, శిక్షణా కార్యక్రమాలను కూడా ఇప్పటికే చేప ట్టింది. ఈసీఐ ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సిసు దర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను చేపట్టిన సంగతి తెలిసిందే.

# అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు



## వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి...

## - సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్,మార్చి6,తెలంగాణ దిశ :** అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్ర స్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేం ద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యా ఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ.1.85లక్షల కోట్ల విలువైన జాతీ య రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారు ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూత నంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయం లోనే జాతీయ రహదారులతో అనుసంధాని ంచామని ఇది చాలా గొప్ప విషయమని పేర్కొ న్నారు. 5 మే, 2025 నాడు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లై ఓవర్‌ను ఘనంగా ప్రారంభించారని అన్నారు.

# సివిల్స్ ఫలితాలు విడుదల

## సత్తా చాటిన తెలుగు అభ్యర్థులు - అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్

**న్యూఢిల్లీ,మార్చి6 :** సివిల్స్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండి యా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలిచారు. ఆకాన్ష్‌ధుల్ మూ డో ర్యాంక్ పొందారు. రాఘవ్ ఝున్‌ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ పరీక్ష ల్లో తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు సత్తా చాటా రు. సృజన (55వ ర్యాంక్), డీఎస్‌కే ప్రచేత్ (193వ ర్యాంక్), ఎస్.వర్షిత్‌రెడ్డి (259వ ర్యా ంక్),ఎం.పవన్‌కుమార్‌రెడ్డి (297వ ర్యాంక్), వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), పుడారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాం క్), కోరపాతుల శ్రీకర్‌రాజు (806వ ర్యాం క్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్), గుగులోతు జితేందర్ నాయక్ (939వ ర్యాంక్) సాధిం చారు. ఈపరీక్షా ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో వెబ్ సైట్‌లో మార్కులు అప్ లోడ్ చేస్తామని యూపీఎస్సీ ప్రకటించింది. మరిన్ని వివరాలు కోసం ఈ ఫోన్ నెంబ ర్లు.. 23385271, 23381125, 230 98543సంప్రదించాలని ఉత్తీర్ణులైన అభ్య ర్థులకు సూచించింది. ఉదయం 10 నుంచి 05.00 గంటల మధ్య సంప్రదిం చాలని యూ పీఎస్సీ స్పష్టం చేసింది.

## సివిల్స్ విజేతలకు సీఎం రేవంత్ అభినందనలు



**హైదరాబాద్,మార్చి,6,తెలంగాణ దిశ :** సివిల్ సర్వీసెస్ 2025 ఫైనల్ ఫలితాల్లో విజయం సాధించిన తెలంగాణ అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాష్టం నుంచి 20 మంది సివిల్స్ పరీక్షల్లో విజయం సాధించగా వారందరినీ సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. యుపీఎస్సీ నిర్వహించే అత్యంత ప్రతిష్టాత్మకమైన యూపీ ఎస్సీలో పేద కుటుంబీకులు ఉంటారని గుర్తించిన ప్రభుత్వం వారికి అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయహస్తం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా మెయిన్స్ రాసే విద్యార్థులకు రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తోంది. అయితే గతేడా ది సివిల్స్ అభయహస్తం కింద సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన 202 మంది అభ్యర్థులకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిం చింది. వారిలో 51 మంది ఇంటర్వ్యూకు సెలెక్ట్ అయ్యారు. వారందరికీ సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నగదుని అందజేసింది.

## బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కేసీఆర్‌కు ఆహ్వానం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీఆర్ఎస్ అధినేత , మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నాచారం గుట్ట శ్రీ లక్ష్మీ నృసి ంహ స్వామి దేవస్థానం ప్రతినిధులు కలిశా రు. ఈ నెల 8 నుంచి 19 వరకు జరిగే బ్రహ్మోత్స వాల కు హాజరు కావాలని కోరుతూ శుక్రవారం ఆహ్వాన పత్రికను,స్వామి వారి ప్రసాదాన్ని అందజేశా రు. ఈ సందర్భగా ఆలయ అర్చకులు కేసీఆర్‌ను ఆశీర్వదిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీందర్ , ఈవో రంగాచారి , అర్చకులు పాల్గొన్నారు...

## బేగంపేటలోని వాతావరణ కేంద్రానికి బాంబు బెదిరింపు




**హైదరాబాద్,మార్చి,6,తెలంగాణ దిశ :** నగరంలో ఫేక్ బాంబ్ బెదిరింపులు రావడం ఇటీవల కాలంలో ఎక్కువైంది. శంషాబాద్ విమానాశ్రయం, పాఠ శాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు బాంబు బెదిరింపు ఘటన మరవక ముందే తాజాగా.. హైదరాబాద్‌లోని బేగం పేట లో బాం బు బెదిరింపు కలకలం రేపింది. ఉదయం 6 గంట లకు అగంతకులు వాతావరణ శాఖకు మెయిల్ ద్వారా బాంబు ఉందంటూ సందేశం పొంపారు. ఉదయం 9:30కు మెయిల్ చూసుకుకున్న వాతావరణ కేంద్రం పోలీ సులకు సమాచారం ఇచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక

## - సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 06 (తెలంగాణ దిశ):**ప్రజా ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల సమస్యలను సమన్వయంతో పరిష్కరించేందుకే 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులకు ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు నారాయణ రెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి, అధికారులకు మంచి పేరు వస్తుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జవాబుదారీ తనంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల




పాటు చేపడుతున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి అవి చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పది ప్రధాన అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రజల వద్దకే వెళ్లనున్నారని చెప్పారు. రేషన్ కార్డులు, ఇల్లు లేని నిరుపేదలకు గృహాలు కేటాయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల అమలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించామని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయని పేర్కొన్నారు. హౌసింగ్ పథకం కింద ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కూడా చెప్పారు. ఈ అవగాహన సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డితో పాటు వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# క్లౌడ్ స్టోరేజ్ సేఫ్టీ ఎంత..?

హైదరాబాద్,(తెలంగాణ దిశ): నేటి డిజిటల్ యుగంలో, ప్రతి ఒక్కరికీ ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు, యాప్ డేటా పుష్కలంగా ఉంటాయి. అయితే, ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లలో పరిమిత స్టోరేజ్ కారణంగా.. ప్రతిదీ ఒకే చోట నిల్వ చేయడం అసాధ్యం. క్లౌడ్ స్టోరేజ్ ఆధునిక, సురక్షితమైన పరిష్కారంగా ఉద్భవించింది. క్లౌడ్ స్టోరేజ్ అంటే మీ డిజిటల్ ఫైల్‌లను ఇంటర్నెట్ ద్వారా రిమోట్ సర్వర్‌లో నిల్వ చేయడం. దీని అర్థం మీ ఫోటోలు, వీడియోలు మీ ఫోన్ లేదా కంప్యూటర్‌లో కాకుండా కంపెనీ డేటా సెంటర్‌లో నిల్వ చేయడం. ఈ డేటా సెంటర్ వేలకొద్దీ శక్తివంతమైన కంప్యూటర్లు, సర్వర్‌లతో రూపొందించడం జరిగింది. ఇవి మీ డేటాను సురక్షితంగా ఉంచుతూ 24 గంటలూ పనిచేస్తాయి.మీరు గూగల్ డ్రైవ్, ఐక్లౌడ్, డ్రాప్ బాక్స్ వంటి క్లౌడ్ సేవను ఉపయోగించినప్పుడు, మీ ఫైల్ ఇంటర్నెట్ ద్వారా ఆ కంపెనీ సర్వర్‌లకు వెళుతుంది. అక్కడ, ఫైల్ చిన్న డేటా బ్లాక్‌లుగా విభజించబడి బహుళ సర్వర్‌లలో నిల్వ చేయడం జరుగుతుంది. ఒక సర్వర్ సాంకేతిక వైఫల్యాన్ని ఎదుర్కొంటే, మీ డేటాను మరొక సర్వర్ నుండి సులభంగా తిరిగి పొందగలిగేలా ఇది పని చేస్తుంది. దీనిని డేటా రిడెండెన్సీ అంటారు. తరువాత, మీరు అదే ఫైల్‌ను మళ్ళీ తెరిచినప్పుడు, సిస్టమ్ ఈ డేటా బ్లాక్‌లన్నింటినీ కలిపి మీకు పూర్తి ఫైల్‌ను చూపుతుంది. ఈ మొత్తం ప్రక్రియకు కొన్ని సెకన్లు పడుతుంది. మీ ఫైల్ అక్కడే ఉన్నట్లు, క్లౌడ్‌లో సురక్షితంగా ఉన్నట్లు మీకు అనిపిస్తుంది.క్లౌడ్ కంపెనీలు తమ సర్వర్లలో నిల్వ చేసిన డేటాను ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని ఉపయోగించి రక్షిస్తాయి. దీని అర్థం మీ ఫైల్‌లు కోడెడ్ రూపంలో నిల్వ చేయడం జరుగుతుంది. వీటిని తెలియని వారు చదవలేరు. యాక్సెస్ చేయలేరు. లాగిన్ ఆధారాలు, యాక్సెస్ అనుమతులు ఉన్న వినియోగదారులు మాత్రమే ఫైల్‌లను తెరవగలరు. అదనంగా, కంపెనీలు బహుళ-పొర భద్రత, ఫైర్‌వాల్‌లు, సాధారణ బ్యాకప్ వ్యవస్థలను ఉపయోగించి డేటా హ్యాకింగ్ లేదా నష్టం నుండి రక్షించినట్లు నిర్ధారించుకుంటాయి. వేగవంతమైన, నమ్మదగిన సేవలను అందించడానికి క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో తమ డేటా సెంటర్లను నిర్మించారు. ఉదాహరణకు, గూగుల్ అమెరికా, సింగపూర్, ఐర్లాండ్, భారతదేశం వంటి దేశాలలో డేటా సెంటర్లను కలిగి ఉంది. అదేవిధంగా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ కూడా వారి స్వంత విస్తారమైన సర్వర్ నెట్‌వర్క్‌లను కలిగి ఉన్నాయి. ఇవి 24 గంటలూ డేటాను నిల్వ చేసి నిర్వహిస్తాయి.క్లౌడ్ స్టోరేజ్ అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే మీరు మీ పరికరంలో డేటా స్టోరేజ్ ఖాళీ చేయవలసిన అవసరం లేదు. మీరు మీ ఫైల్‌లను ఎక్కడి నుండైనా యాక్సెస్ చేయవచ్చు. మీరు మీ ఫోన్‌ను పోగొట్టుకున్నా లేదా మీ ల్యాప్‌టాప్ క్రాష్ అయినా, మీ డేటా ఇంటర్నెట్‌లో సురక్షితంగా ఉంటుంది.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

## - బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, మార్చి 06, (తెలంగాణ దిశ)** :అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలేరు పట్టణంలోని ఇందిరా కాంగ్రెస్ భవన్‌లో జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత హాజరయ్యారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, రాష్ట్ర కార్యదర్శి మౌనిక విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీర్ల అనిత మాట్లాడుతూ దేశంలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటి మంది మహిళలను



కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలిపారు. మహిళల అభివృద్ధి, సాధికారత కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పెద్దపీట వేస్తూ పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. మహిళా శక్తి పథకాల ద్వారా మహిళలకు క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారనే భావనతో మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి -- 2026 కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక ప్రగతిని సాధించడమే లక్ష్యమని పేర్కొన్నారు.



అలాగే ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి, ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లు, మున్సిపల్ మహిళా సిబ్బందిని జిల్లా కమిటీ సభ్యులను నీలం పద్మ, బీర్ల అనిత ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పావని, మున్సిపల్ చైర్మన్ బీజని బాలమణి, కౌన్సిలర్లు మరియమ్మ, సరిత, నీరజ, మాజీ కౌన్సిలర్ శమంత, జిల్లా కమిటీ సభ్యులు నీరజ, కవిత, పరంజ్యోతి, పుష్ప, సిద్ధి లక్ష్మి, మండల, టౌన్ అధ్యక్షులు దీప, మమత, రేణుక, ఝాన్సీ, పాము అనిత, డి. కవిత, శ్రీలత, సోనీ తదితరులు పాల్గొన్నారు.

# రాంపూర్ గ్రామ ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపు..

**హుజురాబాద్,(తెలంగాణ దిశ):** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన డా. గోసి కొండ శ్రీరాములు అంత ర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు. వారణాసిలోని ప్రతిష్టాత్మక బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) సోషియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డా. శ్రీరాములు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలో జరిగిన స్వదేశీ నిర్వహణ మరియు సంస్థాగత అధ్యయనాల అంతర్జాతీయ అకాడమీ కాన్ఫరెన్స్ 2025లో పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రపంచ సదస్సులో భారతదేశం నుండి పాల్గొన్న ఏకైక పరిశోధకులు డాక్టర్ శ్రీరాములు గోసికొండ కావడం విశేషం. కెనడా, బ్రెజిల్, యునైటెడ్ కింగ్‌డమ్, ఫిన్లాండ్, న్యూజిలాండ్ వంటి వివిధ దేశాల నుండి హాజరైన దాదాపు 60 మంది ప్రతినిధుల సమక్షంలో ఆయన భారతీయ పరిశోధనను సమర్పించారు. డా. శ్రీరాములు "భారతదేశంలో రహస్యంగా జరిగే ఆధిపత్యాన్ని సినిమాగా ప్రదర్శించడం, గిరిజనుల ఉనికి, రాష్ట్రాధికారం, మరియు సాంస్కృతిక సంఘర్షణ మీద ఒక అన్వేషణ" అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించా రు. ఈ లోతైన అధ్యయనం ప్రముఖ చిత్రం 'కాంతారా'పై సామాజిక శాస్త్ర దృక్పథాన్ని స్పృశిస్తూ, గిరిజన గుర్తింపు, ప్రభుత్వ అధికారం మరియు సాంస్కృతిక రాజకీయాల సమ్మేళనాన్ని విశ్లేషిస్తుంది. ఆయన అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడం మన కరీంనగర్ జిల్లాకు గర్వకారణం.

# ప్రతి కాలనీలో 'బస్తీ బాట' కార్యక్రమం

## - కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, మార్చి 06, (తెలంగాణ దిశ)** :ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు "బస్తీ బాట" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. కాలనీల్లో ఉన్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మల్లాపూర్ ఉమ్మడి డివిజన్ శక్తిసాయి నగర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, చండియా నగర్ తదితర కాలనీలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలలోని ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులు తాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలు, స్ట్రీట్ లైట్లు లేకపోవడం, రోడ్ల



దుస్థితి వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలపై స్పందించిన ఆయన, డ్రైనేజీ మరియు రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బస్తీలలో క్షేత్రస్థాయిలో ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ఈ బస్తీ బాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతారాం రెడ్డి, నెమలి అనిల్ కుమార్, మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కప్పర సాయి కిరణ్ గౌడ్, ఎస్‌వీ కిట్టు, బెల్లం గట్టయ్య, దంతూరి రాజు, శ్రీకాంత్ రెడ్డి, మక్తల బాలరాజ్, కోయగూర బాలరాజ్, సురేష్, బెల్లం శ్రీను, జెమిలా బేగం, మధుసూదన్ రెడ్డి, సద్గుణ, జానీ భాయ్, పార్వతాలు, శ్రీనివాస్, రాజేష్, ఫిరోజ్, శైలజ, విజయ్ చారి, ఉపేందర్, సాయి టిల్లు, సాయి జయంత్ మని, బ్రహ్మపురి కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం నగర్, చండియా నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ల పంపిణీ

## - పరీక్ష పే చర్చాపై విద్యార్థులకు అవగాహన



**కాప్రా, మార్చి 06, (తెలంగాణ దిశ)** :కాప్రా డివిజన్ పరిధిలోని కాప్రా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 150 మంది పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్. విభాకరన్ (బాబీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో "పరీక్ష పే చర్చా" కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్, బిజెపి సీనియర్ నాయకులు రోహిన్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా శాంతి కిరణ్, శుభాషిణి, ఆనంద్ తదితరులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం



చేశారు. పరీక్షల ముందు విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడిని ఎలా అధిగమించాలి, ఏకాగ్రతను ఎలా పెంపొందించుకోవాలి, ఆత్మ విశ్వాసంతో పరీక్షలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై వారు విలువైన సూచనలు అందించారు. అదే విధంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పరీక్ష పే చర్చా కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఇచ్చిన సూచనలు, ప్రేరణాత్మక సందేశాలను కూడా వివరించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంచారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువులకు సహాయపడే విధంగా 150 పరీక్షా కిట్‌లు పంపిణీ చేశారు. ప్రతి కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కిట్లలోఎగ్జామ్ ప్యాడ్, నోట్ పుస్తకం, పెన్నులు, స్కేలు, రబ్బర్, షార్పనర్, ఇతర పరీక్షా సామాగ్రి అంద జేశారు. విద్యార్థుల విద్యా ప్రయాణానికి ప్రోత్సాహం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు ఎస్. విభాకరన్ (బాబీ) కృతజ్ఞతలు తెలిపారు.

# రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికి కాంగ్రెస్ నేతల శుభాకాంక్షలు

**కుత్బుల్లాపూర్, మార్చి 06,(తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారులు (ప్రజా వ్యవహారాలు)గా ఉన్న వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, అధికార ప్రతినిధి, డీసీసీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తదితరులు వేం నరేందర్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. వారి రాజకీయ ప్రయాణం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్ ముదిరాజ్‌తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల సంజీవరెడ్డి, కే.ఎం. గౌరీష్, బట్ట పాలకృష్ణ, గడ్డం రాజేందర్ రెడ్డి, మన్నే రాజు, లక్ష్మ రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, రషీద్, ఆలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ట్రేడింగ్‌లో మెళకువలంటూ..

# 1.36 కోట్లు కొట్టేశారు

**హైదరాబాద్,(తెలంగాణ దిశ):** ట్రేడింగ్‌లో మెళకువలు చెబుతామంటూ సైబర్ నేరాల ముఠా ఓ ఐటీ ఉద్యోగిని నుంచి 1.36 కోట్లు దోచుకున్నారు. నగరంలో కమలానగర్‌కు చెందిన ఓ ఐటీ ఉద్యోగిని సెప్టెంబర్ నెలలో ఫేస్‌బుక్‌లో ఒక లింక్‌ను క్లిక్ చేసింది. బీఓబీక్యాప్స్ ఇన్ఫర్మేషన్ లర్నింగ్ గ్రూప్స్(ఎఫ్516) పేరుతో ఉన్న ఒక వాట్సాప్ గ్రూప్‌కు నెంబర్ యాడ్ అయ్యింది. అందులో ఇద్దరు సైబర్ దొంగలు మారు పేర్లతో వేర్వేరుగా మాట్లాడారు. స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ఎలా? ఏ స్టాక్స్ ఎలాంటి లాభాలొస్తాయనే విషయంలో మెళకువలు చెబుతామంటూ యూజర్ ఐడీ ఇచ్చారు. దీంతో బీవోబీక్యాప్స్ క్యూల్‌బి- ఇన్.కామ్ పేరుతో ఉన్న లింక్‌ను పంపించి అందులో ఖాతాను క్రియేట్ చేసుకొని రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టింది. దీంతో కొన్ని లాభాలు వచ్చాయి, అందులో నుంచి వెయ్యి రూపాయలు విత్ డ్రా చేసుకుంది.

వారం రోజుల తరువాత 'మీకు ట్రూ అల్టా బయో ఎనర్జీ ఐపీఓ ఓపెన్ అయ్యింది, మీరు వెంటనే ఇన్వెస్ట్ చేయండి, అందులో మేం కూడా కొంత ఫండింగ్ చేస్తాం' అంటూ నమ్మించారు. దీంతో రూ. 53.96 లక్షలు, రూ.68 లక్షలు మరోసారి ఇలా రెండు సార్లు ఇన్వెస్ట్ చేసింది. దీంతో స్క్రీన్‌పై రూ. 2 కోట్ల లాభం కన్పించింది. అందులో నుంచి కొంత డబ్బు విత్ డ్రా చేసుకోవడానికి ఆమె ప్రయత్నించింది.

# సంపాదకీయం

## అభద్రత..!?

సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు కోటి ఆశలతో ఆ రంగాన్ని ఎంచుకున్న యువతరంలో కలవరాన్ని సృష్టిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అంటే భవిష్యత్తుకు ఎటువంటి ఢోకా లేదన్న ఒకప్పటి పరిస్థితి ఇప్పుడు మారిపోతోంది. ఏ రోజు ఉద్యోగం ఉంటుందో, ఏ రోజు ఊడుతుందో తెలియని స్థితి నెలకొంటోంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) తన ఉద్యోగుల్లో రెండు శాతం మందిని తొలగిస్తున్నట్లు కొద్దిరోజుల క్రితం చేసిన ప్రకటన ఈ పరిస్థితికి తాజా నిదర్శనం. టిసిఎస్ ఒక్కటే 12 వేల మందిని ఇంటికి పంపనుందని సమాచారం. పిడుగుపాటు లాంటి ఈ ప్రకటనతో టిసిఎస్ ఉద్యోగుల్లో కలకలం రేగింది. ఒక్క టిసిఎస్సే కాదు, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్, విప్రోల వంటి సంస్థలదీ ఇదే బాట! ఉద్యోగులను తొలగించడంలో ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో మిడ్‌లెవల్, సీనియర్ మేనేజర్లే అత్యధికులు! దేశీయ సంస్థలే కాదు, గ్లోబల్ టెక్ కంపెనీగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మైక్రోసాఫ్ట్ కూడా భారీ సంఖ్యలో ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఈ ఏడాదిలోనే ఆ సంస్థ 15వేల మంది ఉద్యోగులను ఇళ్లకు పంపింది. మే నెలలో ఆరువేల మందిని, జులైలో 9వేల మందిని ఆ సంస్థ తొలగించినట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. మైక్రోసాఫ్ట్ మొత్తం ఉద్యోగుల్లో ఇది నాలుగు శాతం! క్లౌడ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ఉద్యోగులను ఆ సంస్థ తొలగిస్తోంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ అధ్యయనం ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 61వేల మందికిపైగా టెక్ రంగంలో ఉద్యోగాలు కోల్పోయారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ తదితర అంతర్జాతీయ సంస్థల ఉద్యోగులు ఈ జాబితాలో ఉన్నారు. 2019 తరువాత నుండి ఎంట్రీ లెవల్ ఉద్యోగుల నియామకం దాదాపు సగానికి పైగా తగ్గిపోయింది. రానున్న రోజుల్లోనూ ఈ పరిణామం కొనసాగనుంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) ప్రభావం రోజురోజుకి పెరుగుతుండటంతో సాధారణ కోడింగ్, టెస్టింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. 'ఎఐ ఫస్ట్' సంస్కరణల్లో భాగంగా ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయంటూ సత్య నాదెళ్ల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం. భారీ లాభాలు వస్తున్నప్పటికి ఉద్యోగులపై వేటు వేయడాన్ని మైక్రోసాఫ్ట్ కొనసాగిస్తోంది. దీనికి ఎప్పటికప్పుడు ఏదో ఒక కారణాలను ఆ సంస్థ చెబుతోంది. మన దేశంలో కొంతకాలంగా టెక్‌రంగం ఒత్తిడిలో కొనసాగుతోంది. సంస్థలు నష్టాల్లో లేనప్పటికీ, గతంతో పోలిస్తే లాభాలు ఆశించినట్లు లేవని చెబుతున్నారు. ఫలితంగా ఐటి సేవల్లో మందగమనం చోటుచేసుకుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్లోబల్ క్లయింట్లకు తక్కువ ఖర్చుతో సేవలందించడమన్నది భారత టెకీ రంగం ప్రధాన వ్యూహంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఏమైనప్పటికీ, సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా 40 అంతకన్నా ఎక్కువ వయసున్న వారు ఉద్యోగాలను కోల్పోతే తిరిగి సంపాదించుకోవడం చాలా కష్టంగా మారుతోంది. చేస్తున్న ఉద్యోగాలపై ఉన్న నమ్మకంతో చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న దుస్థితి అక్కడక్కడా కనపడుతోంది. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని సంస్థలు ఉద్యోగులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచుతున్నాయి. అనధికారికంగా పనిగంటలు పెంచడం, పని ఇవ్వకుండా బెంచ్‌పై ఉంచి బెదిరింపులకు పాల్పడటం వంటి సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో తీవ్ర అభద్రతా భావం సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో చోటుచేసుకుంటోంది. మరోవైపు ఈ రంగంలో తగ్గుతున్న ఉద్యోగాల ప్రభావం హైదరాబాద్, బెంగళూరు వంటి చోట్ల అనుబంధ రంగాలపై కూడా పడుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! కంపెనీల లాభనష్టాల లెక్కలు ఎలా ఉన్నప్పటికీ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. విధి నిర్వహణకు అవసరమైన నైపుణ్యాల పెంపు బాధ్యతను సంస్థలే స్వీకరించాలి. ఆ సాకుతో ఉద్యోగాలను తొలగించడం మానుకోవాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా తమ బతుకులలో పెరుగుతున్న సంక్షోభంపై గళం విప్పాలి!

# విజయ హైస్కూల్‌లో మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన సదస్సు






**కాప్రా, మార్చి 06, (తెలంగాణ దిశ) :**కాప్రా ఆదిత్య నగర్‌లోని విజయ హైస్కూల్‌లో శుక్రవారం మాదక ద్రవ్యాల నిరోధక చర్యలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరు రాజేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కుషాయిగూడ క్రైమ్ విభాగానికి చెందిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల సమావేశ మండపంలో 9, 10వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి వారు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు మానవ శరీరానికి తీవ్ర హానికరమైన పదార్థాలని, వాటి వినియోగం ఒక ప్రమాదకరమైన వ్యసనమని తెలిపారు. నేటి యువతను చెడు మార్గాల్లోకి దారి మళ్లించే దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాల కంటే మాదక ద్రవ్యాల ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 5.6 శాతం జనాభా, అంటే దాదాపు 185 మిలియన్ల మంది మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నారని వెల్లడించారు. ఈ దురలవాటు యువతపై తీవ్రమైన ప్రభావం చూపి వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థులు ఇటువంటి దురలవాట్లకు దూరంగా ఉండి విద్యపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీమతి కొప్పునూరు వీణ, ప్రధానోపాధ్యాయురాలు అద్దంకి పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ



**హెచ్‌బి కాలనీ, మార్చి 06, (తెలంగాణ దిశ) :**మీర్ పేట్, హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం సమీపంలోని సెయింట్ పాల్ స్కూల్‌లో శుక్రవారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పరీక్ష అట్టలు (ఎగ్జామ్ ప్యాడ్స్), జ్యామెట్రీ బాక్స్‌లను పంపిణీ చేశారు. డివిజన్ మాజీ అధ్యక్షులు వంజరి ప్రవీణ్ కరిపే సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విద్యార్థులకు ప్రోత్సాహక కానుకలుగా ఈ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు జర్రిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న వేళ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఏకాగ్రతతో చదువుకోవాలని సూచించారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గౌరవం తీసుకురావాలని తెలిపారు. మీ బంగారు భవిష్యత్తుకు మార్గం సృష్టించుకునే అవకాశం మీ చేతుల్లోనే ఉందని, చదువులో మీ ప్రతిభను నిరూపించుకునే సమయం ఇదేనని విద్యార్థులకు ఉత్సాహం కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉల్లెం బాలరాజు, మల్లేష్ గౌడ్, దేవేందర్ కుమార్, వసంతరావు, వాసు చారి, నవీన్ గౌడ్, మధు ముదిరాజ్, రామకృష్ణ, కిరణ్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతీ పనికి ఓ రేటు... ఆ జిల్లాకే సపరేట్..

### దొరకని దొరలు చాలా శాఖల్లో అనేక మంది..?

**కాకినాడ,తెలంగాణ దిశ :** కోనసీమ జిల్లాల పునర్విభజన తరువాత వేగంగా అభివృద్ధి చెందుతోంది కోనసీమ ప్రాంతం.. ఈక్రమంలోనే ఇక్కడ భూముల రేట్లకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి.. దీంతో ముఖ్యంగా రెవెన్యూ శాఖలో లంచావతారాలు మితిమీరిపోయి ఆర్జీదారుల నుంచి దండుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. వీఆర్‌ఏ స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకు అన్నిచోట్ల లంచాలు లేనిదే ఏ పని అవ్వడం లేదంటున్నారు దరఖాస్తుదారులు. అటు జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాంతాలు ఇప్పుడిప్పుడే అభివృద్ధి అవుతుండగా ఈ గ్రామాల పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు కూడా ఇదే తరహా అవినీతి లీలలు సాగిస్తున్నారంటున్నారు. ఇక జిల్లా కేంద్రమైన అమలాపురం టౌన్ ప్లానింగ్, అర్బన్ డెవలప్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్ ఇలా అనేక శాఖల్లో అవినీతి జోరందుకుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి బలం చేకూరుస్తూ ఇటీవల కాలంలో ఒక్క అంబేడ్కర్ కోనసీమ ప్రాంతంలోనే ఏసీబీ అధికారుల దాడుల్లో అడ్డంగా బుక్కయిపోతున్నవారు కోనసీమ ప్రాంతం వారే ఉండడం విస్మయానికి గురిచేస్తోంది. ఏసీబీ అధికారులు వలకు ఓ పెద్ద అవినీతి చేప చిక్కింది. అమలాపురం తహసీల్దార్ గా పనిచేస్తున్న పి.అశోక్ ప్రసాద్ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికి పోయాడు.. రాజమండ్రి సమీపంలోని రాజవోలుకు చెందిన గంధం దుర్గా కొండలరావు తండ్రి గంధం సత్యనారాయణ అమలాపురం రూరల్ జనుపల్లిలో 15 సెంట్లు భూమిని గతంలో కొనుగోలు చేశారు. ఈ భూమిని విక్రయించేందుకు కొలతలు అవసరం కాగా దీని నిమిత్తం దుర్గా కొండల రావు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే కొలతలు నిర్వహించాలంటే రూ.లక్ష ఇవ్వాలంటూ తహసీల్దార్ డిమాండ్ చేశాడు. చివరకు రూ.50 వేలు ముందస్తుగా ఇవ్వాలని, కొలతలు పూర్తయ్యాక మిగిలిన రూ.50 వేలు ఇవ్వాలని సూచించడంతో లంచం ఇవ్వడం ఇష్టంలేని ఫిర్యాదుదారుడు దుర్గా కొండలరావు రాజమండ్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.

దుర్గా కొండలరావు నుంచి ఇదే తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తోన్న వీఆర్ ఏ రాము రూ.50 వేలు తీసుకుని తహసీల్దార్ అశోక్ ప్రసాద్‌కు ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా ఇద్దరూ దొరికి పోయారు. లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్ అశోక్ ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ రాముపై కేసు నమోదు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ కిషోర్ కుమార్ తెలిపారు. ఈ విషయం స్థానికంగా పెద్ద సంచలనం అయ్యింది..

లంచాలకు రుచి మరిగిన అవినీతి అధికారుల్లో వణుకు మొదలయ్యింది.. ఇటీవల కాలంలోనే తనకున్న పొలాన్ని మ్యుటేషన్ చేసి ఇచ్చేందుకు ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి చెందిన ఓ రైతు నుంచి అదే గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్న వీఆర్వో రూ.20 వేలు డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేను. ఎంతో కొంత ఇస్తాను అని చెప్పినా రేపు రా.. మాపు రా.. అంటూ కాలం గడుపుతున్న వీఆర్వోపై విసుగెత్తని సదరు ఫిర్యాదుదారుడు రాజమండ్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సదరు వీఆర్వో తన స్వగ్రామం అయిన సామంతకుర్రు తీసుకువచ్చి లంచం ఇవ్వాలని డిమాండ్ చేయడంతో నేరుగా ఏసీబీ అధికారులు ఫిర్యాదుదారుడ్ని తీసుకుని వెళ్లి లంచం ఇస్తున్న సమయంలో అడ్డంగా బుక్ చేశారు.రెండు నెలల క్రింతం ఆలమూరు మండలంలో మహిళా సబ్ రిజిస్టర్ ఒకరు ఇలానే లంచం సొమ్ము తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా బుక్కయ్యాడు. మూడు నెలల క్రితం రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో సీఐ, అంతకుముందు ఏడాది క్రితం ఎస్సై ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. రాజోలు నియోజకవర్గం పరిధిలోని సఖినేటిపల్లిలో వీఆర్వో రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు.

# అమెరికాకు భారీగా తగ్గిన భారత విద్యార్థులు..

### రెండేండ్లలో 63 శాతం తగ్గుదల...

న్యూఢిల్లీ: భారతీయ విద్యార్థులకు అమెరికా విద్యపై మోజు తగ్గుతున్నది. వీసా నిబంధనలు, పెరిగిన వ్యయం, తగ్గిన ఉపాధి అవకాశాల నేపథ్యంలో భారత విద్యార్థులు అమెరికా యూనివర్సిటీలకు బదులుగా యూరప్‌వైపు తమ దృష్టి మరల్చారు. గత రెండేండ్లలో ఉన్నత విద్య కోసం అమెరికాను ఎంచుకొనే భారత విద్యార్థుల సంఖ్య 63% తగ్గినట్టు విద్యారుణాలు అందించే జ్ఞాన్‌ధన్ సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. విదేశాల్లో చదువుకోవాలనుకొనే భారత విద్యార్థుల్లో అమెరికాను ఎంచుకొనే వారు 2023లో 54% మంది ఉండగా అది 2025 నాటికి 20 శాతానికి పడిపోయినట్టు ఆ వివరాలు తెలుపుతున్నాయి. అమెరికాలో ఇటీవల అమలులోకి వచ్చిన కఠిన వీసా నిబంధనలు, పెరిగిన ఖర్చులు, విద్యానంతరం ఉపాధి అవకాశాలకు గ్యారెంటీ లేకపోవడం వంటి అంశాలు విద్యార్థులను యూరప్ వైపు మరలుస్తున్నాయని జ్ఞాన్‌ధన్ సీఈవో అంకిత్ మెహ్రా పేర్కొన్నారు. హెచ్-1బీ వీసా ఫీజు పెంపుదల, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్ (ఓపీటీ) సమీక్షలు వంటి అంశాలు విద్యార్థులను ప్రత్యామ్నాయాలవైపు దృష్టి సారించేలా చేశాయని తెలిపారు. ఎక్కువ మంది భారత విద్యార్థులు యూరప్‌లోని జర్మనీ, ఐర్లాండ్,ఫ్రాన్స్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు.

తమ వద్ద ట్యూషన్ ఫీజులు తక్కువని, విద్య అనంతరం ఉపాధి విధానాలను సరళీకరించామని చెప్తూ జర్మనీ విదేశీ విద్యార్థులను ఆకర్షిస్తున్నది. 4%నుంచి 2025 నాటికి 9 శాతానికి పెరిగిం ది. విదేశాల్లో చదువుకోవాలనుకొనే భారత విద్యార్థుల్లో 39% మందిబ్రిటన్‌ను ఎంచుకొంటుండగా ఈ ఏడాది వారి సంఖ్య 143 శాతం పెరిగింది. మరోవైపు కెనడా వైపు వెళ్లే వారి సంఖ్య సైతం 11% నుంచి 2.33 శాతానికి తగ్గిపోగా ఆస్ట్రేలియాను ఎంచుకొనే వారి సంఖ్య స్థిరంగా 7% వద్ద ఉన్నది.

# 5 వేల ఎకరాల్లో వక్క సాగు

**అనంతపురం,తెలంగాణ దిశ :**అనంతపురం రైతులు వక్క సాగుతో ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. ఒక్కసారి నాటితే వందేళ్ల పాటు దిగుబడినిచ్చే ఈ పంటతో ఎకరాకు రూ.4 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో 5 వేల ఎకరాల్లో వక్క సాగు చేస్తున్నారు. చల్లని వాతావరణ ఈ పంట సాగుకు అనుకూలం అంటున్నారు రైతులు.వ్యవసాయం అంటే ప్రకృతితో జూదం ఆడటం లాంటిదే. వాతావరణం మొదలు వాడే విత్తనాలు, వేసే మందులు ఇలా ప్రతిది పంట దిగుబడి మీద ప్రభావం చూపుతాయి. ఒకవేళ అన్ని కలిసి వస్తే.. మార్కెట్‌లో ధర ఉండదు. అయితే ఈ సమస్య ఎక్కువగా సంప్రాదాయ పంటల సాగు విషయంలోనే ఎదురవుతుంది. అలా కాకుండా కాస్త భిన్నంగా ఆలోచించి... ఇతర పంటల సాగు మీద రైతులు దృష్టి సారిస్తే.. పెట్టుబడి ఖర్చులు కలిసి రావడం మాత్రమేకాకఏళ్ల తరబడి ఆదాయం పొందేందుకు కూడా అవకాశం ఉంటుంది. అనంతపురం రైతులు ఇదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఒక్కసారి సాగు చేస్తే.. వందేళ్ల పాటు దిగుబడి ఇచ్చే పంటల సాగును ఎంచుకున్నారు...ఉమ్మడి అనంతపురం జిల్లా రైతుల జీవితాల్లో వక్క సాగు వెలుగులు నింపు తుంది. జిల్లా వ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో వక్క సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు పలువురు రైతులు. మరీ ముఖ్యంగా జిల్లాలోని అగళి, అమరాపురం, కుందుర్పి, మడకశిర, గుడిబండ, కళ్యాణదుర్గం, శెట్టూరు వంటి మండలాల్లో.. దాదాపు 5 వేల ఎకరాల్లో వక్క సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో వక్క సాగుకు అనుకూలమైన వాతావరణం ఉండటమే కాక.. ఈ రైతులు సేంద్రియ పద్ధతుల్లో పంట సాగు చేస్తూ.., తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తూ.. ఆర్థికంగా ఎదుగుతున్నారు.నీటి వసతి పుష్కలంగా ఉన్న ఏ నేలలో అయినా వక్కనుపండించవచ్చు. ఒక్కసారి ఈ పంటను నాటితే వందేళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఎకరాకు400-500 మొక్కలు నాటుకో వచ్చు. రెండేళ్ల వయసున్న మొక్కలను నాటితే కేవలం నాలుగు సంవత్సరాల్లోనే పంట చేతికి వస్తుంది. ఆగస్టు నుంచి జనవరి వరకు మొత్తం 5విడతల్లో పంట కోస్తారు.చల్లటి వాతావరణం వక్క దిగుబడిని పెంచుతుంది అంటున్నారు రైతులు. అందుకే వారు వక్క పంట చుట్టూ..అవిస, బూరమొక్కలను నాటుతున్నారు. దీని వల్ల వాతావర ణం చల్లగా ఉంటుంది. ఇక పంట సాగులో.. పశువుల పేడ, సేంద్రి య ఎరువులువాడితే అదిక దిగుబడివచ్చి.. మంచి లాభాలు వస్తాయం టున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని అగళి, అమరాపురం మండలాల్లో.. 60 నుంచి 100 ఏళ్ల వయసున్న తోటల్లో ఇప్పటికి కూడా దిగుబడి తగ్గలేదని రైతులు చెప్పుకొచ్చారు.వక్క సాగు విషయానికి వస్తే.. ఈ మొక్కలు నాటడానికి ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఇకఆదాయం విషయానికివస్తే.. బయటక బహిరం గ మార్కెట్‌లో క్వింటాల్ వక్క ధర రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతోంది. ఎకరాకు ఎంత లేదన్నా.. 6-8 క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ.4 లక్షలవరకు ఆదాయం వస్తుంది. వక్కతో పాటు మిరియాలు, తమలపాకులు అంతర పంటలుగా సాగు చేస్తే అదనపు ఆదాయం పొందేందుకు అవకాశం ఉంది అంటున్నారు ఈ పంటను సాగు చేస్తున్న రైతులు. వక్కను ప్రాసెస్ చేసిన తర్వాత మిగిలిపోయే గుజ్జును కిలో రూ.150 చొప్పున అమ్ముతున్నారు. వక్క మట్టలతో ప్లేట్లు తయారు చేయడం వల్ల స్థానికులకు ఉపాధి లభిస్తోంది. కనుక రైతులు ఇలాంటి ప్రత్యామ్నయం పంటల సాగు మీద దృష్టి సారించాలంటున్నారు వ్యవసాయ శాఖ అధికారులు.

# స్వచ్ఛమైన గాలి..ఆరోగ్యక జీవనం కాలుష్యం కట్టడితో సాధ్యం


### స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ పిలుపు


విజయవాడ: స్వచ్ఛమైన గాలితో మనం ఆరోగ్యకరంగా జీవన ప్రయాణం కొనసాగించ వచ్చని.. ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులు వేస్తూ కాలుష్య కట్టడికి సమష్టిగా కృషిచేద్దామని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. క్టోబర్ నెల మూడో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా తిరువూరు మండలం,లక్ష్మీపురం గ్రామంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ డా.జి.లక్ష్మీశ,శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరా వు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం స్థానిక రైతులకు కిలో రూ.10కేవర్మీ కంపోస్టును అందజేశారు. ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అంగన్వాడీ, వైద్య ఆరోగ్యశాఖ, పీఎం సూర్యఘర్ స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర అ 2047 సాకారానికి ముందడుగుగా ప్రతిఒక్కరూ స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రకు కృషిచేయాల్సిన అవసరముందని.. ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగించడం, విస్తృతంగా మొక్కలు నాటడం, సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించడం, పరిశ్రమల్లో కాలుష్యాన్ని తగ్గించే విధానాలను అనుసరించడం, పంట అవశేషాల్ని కాల్చకుండా నివారించడం వంటివి పాటించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెలా మూడో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఈ రోజు క్లీన్ ఎయిర్ (స్వచ్ఛమైన గాలి) ఇతివృత్తంతో కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు వివరించారు. మన దైనందిన జీవితంలో పర్యావరణహిత మార్గాలను అనుసరించడం ద్వారా మన భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అత్యంత విలువైన బహుమతిగా అందిద్దామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ర్యావరణ పరిరక్షణకు, మానవ ఆరోగ్యానికి రెండింటికీ స్వచ్ఛమైన గాలి అత్యంత అవసరమని.. కాలుష్యాన్ని కట్టడి చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరముందన్నారు. గాలి కాలుష్యం వల్ల శ్వాసకోశ సమస్యలతో పాటు వివిధ అనారోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే టపాసులు ఉపయోగించకుండా పర్యావరణహితంగా దీపావళి పండగను ఆనందోత్సాహాలతో జరుపుకుందామని, నిత్య జీవితంలో పర్యావరణహిత విధానాలను అనుసరిద్దామని శాసనసభ్యులు కొలికపూడిశ్రీనివాసరావు పేర్కొన్నారు.

# అపార్ట్ మెంట్ వద్దనుకుంటున్నారోచ్

హైదరాబాద్:కాస్త దూరంగా పోయి అయినా ఇండిపెండెంట్ ఇళ్లే కొనాలనుకునేవారు చాలా మంది ఉన్నారు. అలాంటి వారి కోసం హయత్ నగర్ హాట్ ఫేవరేట్ గా మారింది. చిన్న బిల్డర్లు 100 చదరపు గజం నుంచి 300చదరపు గజాల వరకు ఇళ్లను నిర్మిస్తున్నారు, ధరలు 45 లక్షలనుంచి 1కోటి వరకు చెబుతున్నారు. హయత్‌న గర్‌చుట్టూ రెసిడెన్షియల్ ప్లాట్లు ఇంకా అందుబాటులో ధరల్లోనే ఉన్నాయి, ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో చదరపు గజానికి ?35,000 నుంచి-50,000 వరకు. పెద్ద అంబర్‌పేట్‌లో -32, 000 నుంచి -54,000 వరకు, పసుమాముల , తట్టి అన్నారంలో ?42,000 నుంచి -60,000 వరకు ధరలు ఉన్నట్లుగా రియల్ ఎస్టేట్ బ్రోకర్లు చెబుతున్నారు.హయత్‌నగర్ సమీపంలో భూమి ధరలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో ఎకరానికి-3-4.5 కోట్లు, కొంచెం లోపల ?2-3 కోట్లు. రియల్ ఎస్టేట్ నిపుణులు, రీజియనల్ రింగ్ రోడ్ మరియు రింగ్ రైల్ వంటి అవసర సదుపాయాలు మొదలైన తర్వాత భూమి మరియు రెసిడెన్షియల్ ప్లాట్ ధరలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. అపార్టుమెంట్లు కూడా విరివిగా నిర్మిస్తున్నారు. చదరపు అడుగుకు -3,400 నుంచి -4,200 వరకు. డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్:-45లక్షల నుంచి -52 లక్షలు. ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్: 55 లక్షల నుంచి -65 లక్షలు. రామోజీ ఫిల్మ్ సిటీ చుట్టూ కొన్ని డెవలపర్లు విల్లాలు నిర్మిస్తున్నారు. హయత్‌నగర్‌కు ఔటర్ రింగ్ రోడ్, విజయవాడ జాతీయ రహదారి ద్వారా మెరుగైన కనెక్టివిటీ ఉంది .

# థైరాయిడ్.. జీవక్రియల రారాజు





మనిషి శరీరంలో హార్మోన్లను సమతుల్యం చేయడంలో కీలకపాత్ర పోషించేదే థైరాయిడ్ గ్రంథి. ఇది సక్రమంగా పనిచేయకపోతే హార్మోన్లన్నీ అసమతుల్యంగా మారిపోతాయి. దీంతో శరీర భాగాలు సక్రమంగా పనిచేయవు. దీనివల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. అందువల్ల థైరాయిడ్%ౌ% పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రస్తుతం అధిక రక్తపోటు (బీపీ), డయాబెటిస్ వ్యాధుల్లానే థైరాయిడ్ సమస్య కూడా సాధారణంగా మారిపోయింది. ఈ సమస్యకు కచ్చితమైన కారణాలు లేవు. ఒక్కసారి థైరాయిడ్ సమస్య తలెత్తిందంటే జీవిత కాలం మందులు వాడాల్సిందే. వివిధ అనారోగ్యాలకు దారితీసే థైరాయిడ్ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రతి ఏటా మే 25న 'ప్రపంచ థైరాయిడ్ దినం'గా పాటిస్తున్నారు. దీన్ని పురస్కరించుకుని థైరాయిడ్ సమస్యలు ఎన్ని రకాలు, అవి రావడానికి కారణాలు, వాటి లక్షణాలు, థైరాయిడ్ వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, అందుబాటులో ఉన్న చికిత్స విధానాల గురించి తప్పకుండా తెలుసుకోవాలి.

%థైరాయిడ్ గ్రంథి మనిషి శరీర జీవక్రియల్లో కీలకపాత్ర పోషిస్తుంది. మెడ భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఉండే ఈ గ్రంథి థైరాయిడ్ హార్మోన్లను విడుదల చేస్తుంది. ఇవి మానవ జీవక్రియల్లో%ౌ% అంటే, మనిషి పుట్టిన దగ్గరనుంచి మెదడు అభివృద్ధి, ఎత్తు పెరుగుదల, బాలికల్లో రజస్వల కావడానికి, స్త్రీలలో నెలసరి, గర్భం దాల్చడం వంటి వాటిలో కీలకపాత్ర పోషిస్తాయి. అయితే, థైరాయిడ్ సమస్యలు పురుషులతో పోలిస్తే స్త్రీలలోనే అధికంగా కనిపిస్తాయి. అందువల్లే మహిళలు గర్భధారణకు ముందు తప్పనిసరిగా థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవాలి. లేకపోతే తల్లికి థైరాయిడ్ సమస్య ఉంటే పుట్టబోయే బిడ్డలో మెదడు వృద్ధి చెందకపోవచ్చు. సాధారణంగా గర్భం దాల్చిన 11-12 వారాల తర్వాతనే కడుపులో ఉన్న శిశువులో థైరాయిడ్ గ్రంథి ఏర్పడుతుంది. అంటే అప్పటివరకు పిండం అభివృద్ధి తల్లి థైరాయిడ్ గ్రంథిపైనే ఆధారపడి ఉంటుంది. గర్భధారణ సమయంలో తల్లి తీవ్రమైన థైరాయిడ్ సమస్యతో బాధపడుతూ ఉంటే దాని ప్రభావం కడుపులో శిశువు మెదడుపై పడుతుంది. వైద్యులను సంప్రదించాలి థైరాయిడ్ ఉన్న మహిళలు గర్భం దాల్చినప్పుడు వెంటనే ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదించాలి. వాళ్లు సూచించిన ప్రకారం థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవాలి. ఎందుకంటే గర్భం దాల్చిన థైరాయిడ్ బాధిత గర్భిణులకు థైరాయిడ్ డోస్ వారి ఆరోగ్యస్థితి ఆధారంగా మార్చాల్సి ఉంటుంది. అంతేకాకుండా వారిని వైద్యులు సాధారణ గర్భిణుల కంటే జాగ్రత్తగా పర్యవేక్షించాల్సి ఉంటుంది.

థైరాయిడ్ లోపంతో అనారోగ్య సమస్యలు: ఎదుగుదల లోపిస్తుంది. బాలికలు రజస్వల కాకపోవడం. పిల్లలు ఎత్తు పెరగకపోవడం. గర్భధారణలో అవరోధాలు.

థైరాయిడ్‌లో రకాలు: ప్రధానంగా థైరాయిడ్‌లో మూడు రకాల రుగ్మతలు ఉంటాయి. 1. హైపో థైరాయిడ్, 2. హైపర్ థైరాయిడ్, 3. థైరాయిడ్ క్యాన్సర్. థైరాయిడ్ సమస్యను సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే రుగ్మతను నియంత్రణలో ఉంచవచ్చు. థైరాయిడ్ సమస్య ఉన్నవారికి ఎలాంటి పథ్యం అవసరం ఉండదు. ఎలాంటి ఆహార నియమాలు పాటించాల్సిన పనిలేదు. అన్నిరకాల ఆహార పదార్థాలు తీసుకోవచ్చు.

1. హైపో థైరాయిడ్: థైరాయిడ్ గ్రంథి నుంచి వెలువడే హార్మోన్ల స్థాయిలు రక్తంలో సాధారణం కంటే తక్కువగా ఉండే పరిస్థితి హైపో థైరాయిడ్ లేదా లో థైరాయిడ్. ఈ సమస్యను రక్త పరీక్ష ద్వారా నిర్ధారిస్తారు.

లక్షణాలు: బరువు పెరగడం. నీరసంగా, డల్‌గా ఉండటం. వెంట్రుకలు రాలిపోవడం. మహిళల్లో నెలసరి సక్రమంగా రాకపోవడం. గర్భధారణ సమస్యలు. మెడ దగ్గర వాపు. పిల్లల్లో హైపో థైరాయిడ్ లక్షణాలుఎదుగుదల లేకపోవడం. మెదడులో పరిపక్వత రాకపోవడం. బాలికల్లో రజస్వల సమస్య.

2. హైపర్ థైరాయిడ్: రక్తంలో ఉండాల్సిన మోతాదు కంటే ఎక్కువ స్థాయిలో థైరాయిడ్ హార్మోన్లు ఉండటమే హైపర్ థైరాయిడ్. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే శరీరంలో జీవక్రియలు దెబ్బతిని తీవ్ర అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది.

లక్షణాలు: బరువు పెరిగిపోవడం. ఊబకాయం రావడం.గుండెలో దడ. గుండె వేగంగా కొట్టుకోవడం. ఎక్కువగా ఆకలి వేయడం. కాళ్లు చేతులు వణకడం. వెంట్రుకలు రాలిపోవడం.

స్త్రీలలో నెలసరి సమస్యలు. గర్భధారణ సమస్యలు. అలసట. నీళ్ల విరేచనాలు. సరిగ్గా నిద్ర పట్టదు.

ప్రధాన కారణాలు: ఆటో ఇమ్యూనిటీ అనేది సర్వసాధారణ కారణంగా చెప్పవచ్చు. అంటే మన శరీరం మన కణజాలానికి వ్యతిరేకంగా యాంటిబాడీస్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల థైరాయిడ్ గ్రంథి పనితీరు దెబ్బతింటుంది. దానినుంచి విడుదలయ్యే హార్మోన్లలో వ్యత్యాసాలు ఏర్పడతాయి. వీటివల్ల హైపో లేదా హైపర్ థైరాయిడ్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలుంటాయి. అయితే ఈ ఆటో ఇమ్యూనిటీ సమస్య వంశ పారంపర్యంగా వచ్చే అవకాశం ఉంటుంది. అదికాకుండా ఏదైనా వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల కూడా థైరాయిడ్ వచ్చే అవకాశాలు ఉంటాయి. శరీరంలో అయోడిన్ స్థాయిలు తగ్గితే కూడా థైరాయిడ్ సమస్య ఏర్పడుతుంది. థైరాయిడ్ సమస్యలకు వయసుతో సంబంధం లేదు. ఏ వయసు వారికైనా రావచ్చు. కడుపులో ఉన్నప్పుడు శిశువుకు థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పరిపక్వత చెందకపోతే ఆ శిశువుకు పుట్టుకతోనే థైరాయిడ్ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. నవజాత శిశువుల్లో థైరాయిడ్ లక్షణాలు కనిపించవు. కాబట్టి, పుట్టిన వెంటనే శిశువుకు కచ్చితంగా థైరాయిడ్ పరీక్షలు కూడా చేస్తారు.

నిర్ధారణ పద్ధతులు: థైరాయిడ్ సమస్యను రక్తపరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. సాధారణంగా థైరాయిడ్ హార్మోన్లను టీ3, టీ4, టీఎస్‌హెచ్ (థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్)గా పిలుస్తారు. థైరాయిడ్ టెస్టులు చేసినప్పుడు టీ3, టీ4, టీఎస్‌హెచ్ విలువల ఆధారంగానే రోగికి ఏరకమైన థైరాయిడ్ ఉందో నిర్ధారిస్తారు. టీ3, టీ4 తక్కువగా ఉండి, టీఎస్‌హెచ్ ఎక్కువగా ఉంటే వారికి లో థైరాయిడ్ లేదా హైపో థైరాయిడ్ ఉన్నట్టుగా నిర్ధారిస్తారు. అదే హైపర్ థైరాయిడ్ రోగుల్లో అయితే టీ3, టీ4 ఎక్కువగా ఉండి, టీఎస్‌హెచ్ తక్కువగా ఉంటుంది. థైరాయిడ్ గ్రంథిలో వాపు ఉంటే అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా నిర్ధారిస్తారు.

చికిత్సా విధానం: థైరాయిడ్ స్థాయిలు, వాటికి సంబంధించిన యాంటిబాడీస్ ఆధారంగా చికిత్స చేయాల్సి ఉంటుంది. సాధారణంగా థైరాయిడ్ లక్షణాలు ఉండి, టీఎస్‌హెచ్ స్థాయిలు ఎక్కువగా ఉంటే వెంటనే చికిత్స మొదలుపెట్టాలి. ఒక్కసారి థైరాయిడ్ చికిత్స ప్రారంభిస్తే ఇక జీవితాంతం తీసుకోవాల్సి ఉంటుంది. హైపో థైరాయిడ్, హైపర్ థైరాయిడ్ రోగులకు చికిత్సా విధానం వేర్వేరుగా ఉంటుంది. లో థైరాయిడ్ రోగులకు 'థైరాక్సిన్' అనే థైరాయిడ్ హార్మోన్ మాత్రలు ఇస్తారు. రోగి రక్తంలోని థైరాయిడ్ విలువల ఆధారంగా మాత్రల డోసు సూచిస్తారు. ఇక హైపర్ థైరాయిడ్ రోగులకు మూడు రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి థైరాయిడ్ మాత్రలు ఇవ్వడం. రెండోది 'రేడియో అయోడిన్ అబ్లేషన్' ఇస్తారు. ఇది చుక్కల మందు రూపంలో ఉంటుంది. ఈ మందు వేయడం వల్ల అధిక పరిమాణంలో ఉన్న థైరాయిడ్ హార్మోన్లు సాధారణ స్థాయికి వస్తాయి. థైరాయిడ్ గ్రంథిలో వాపు వచ్చి పరిమాణం పెరిగినప్పుడు శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. అయితే గ్రంథి పరిమాణం పెద్దగా ఉన్న ప్రతి ఒక్కరికీ సర్జరీ అవసరం ఉండదు. కొంతమందికి మాత్రమే కొన్ని సందర్భాలలో శస్త్రచికిత్స అవసరమవుతుంది.




# సప్లిమెంట్లు.. సపరేటు!

ఈ మధ్యకాలంలో చాలామంది 'సప్లిమెంట్లు' తీసుకుంటున్నారు. ఆహారంతో శరీరానికి తగినన్ని పోషకాలు అందక.. మాత్రలను ఆశ్రయిస్తున్నారు. అయితే, మహిళల వయసును బట్టి.. పోషకాల అవసరాలు వేరు వేరుగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. టీనేజర్లతో పోలిస్తే.. మెనోపాజ్‌కు చేరిన మహిళల శరీర తత్వం వేరుగా ఉంటుందని అంటున్నారు. కాబట్టి, సప్లిమెంట్లు కూడా సపరేటుగా తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. టీనేజీ అమ్మాయిలకు ఐరన్, కాల్షియం ఎక్కువ అవసరం. నెలసరి సమయంలో వీరు రక్తం ఎక్కువగా కోల్పోతారు. కాబట్టి, ఐరన్.. రక్తహీనతను తగ్గిస్తుంది. అదే సమయంలో కాల్షియం.. ఎముకల అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

పెళ్లయిన మహిళలకు ఫోలిక్ యాసిడ్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ డి చాలా అవసరం. ముఖ్యంగా.. గర్భధారణ కోసం న్యూరల్ ట్యూబ్ లోపాల నివారణకు ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా తీసుకోవాలి. ఇక హార్మోన్ల సమతుల్యతకు ఒమేగా-3 సహాయపడుతుంది. కాల్షియం శోషణకు విటమిన్ డి.. సహకరిస్తుంది. రోగ నిరోధక శక్తిని బలపరుస్తుంది. గర్భధారణ సమయంలో ఐరన్, డీహెచ్ఏ,

ఫోలిక్ యాసిడ్‌తోపాటు అయోడిన్‌తో కూడిన ప్రీనేటల్ మల్టీవిటమిన్లను తీసుకోవడం మంచిది. ఇవి గర్భస్థ శిశువులో మెదడు పెరుగుదలకు తోడ్పడతాయి. ప్రసవ సమస్యలను నివారించడంలో సాయపడతా యి.పెరిమెనోపాజ్, మెనోపాజ్ దశలో ఉన్న మహిళల్లో ఎముకల సాంద్రత తగ్గడం, మానసిక స్థితిలో మార్పులు రావడం, అలసట పెరగడం వంటి సమస్యలు చుట్టుముడతాయి. ఇలాంటి సమయంలో విటమిన్ బి, డి, కాల్షియం, మెగ్నీషియం చాలా అవసరం.ఇక వృద్ధులు విటమిన్ బి12, డి3తోపాటు కాల్షియం సప్లిమెంట్లు తీసుకోవాలి. ఇవి బోలు ఎముకల వ్యాధిని ఎదుర్కోవడంలో సాయపడతాయి. నాడీవ్యవస్థ ఆరోగ్యానికి హామీ ఇస్తాయి.



# ఈ నట్స్‌ను ఎప్పుడైనా చూశారా..?

## అనేక అద్భుతాలు చేస్తాయి.. విడిచిపెట్టకుండా తినండి..!

నట్స్.. ఈ పేరు చెప్పగానే మనకు బాదం, జీడిపప్పు, వాల్ నట్స్ గుర్తుకు వస్తాయి. కానీ మనకు తెలియని ఇంకా ఎన్నో రకాల నట్స్ మనకు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో మెకడేమియా నట్స్ కూడా ఒకటి. ఇవి వెన్న రుచిని కలిగి ఉంటాయి. క్రీమ్ లాగా అనిపిస్తాయి. ఎంతో రుచిగా ఉండడమే కాదు అనేక పోషకాలను కూడా అందిస్తాయి. మెకడేమియా నట్స్‌లో క్యాలరీలు, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మెకడేమియా నట్స్‌లో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. ఈ కొవ్వులు మన శరరీంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

ఆర్థ్రైటిస్ ఉన్నవారికి..: మెకడేమియా నట్స్‌లో

ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి ఈ నట్స్ మేలు చేస్తాయి. మెకడేమియా నట్స్‌లో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్లేవనాయిడ్స్, టోకోట్రియనోల్స్ జాబితాకు చెందుతాయి.


అలాగే ఈ నట్స్‌లో విటమిన్ ఇ కూడా అధికంగానే ఉంటుంది. ఇవన్నీ శరీరానికి హాని చేసే ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల క్యాన్సర్, డయాబెటిస్, నాడీ సంబంధ సమస్యలు రాకుండా ఉంటాయి. ఈ నట్స్‌లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. నొప్పుల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. దీంతో ఆర్థ్రైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

మెదడు పనితీరుకు..: మెకడేమియా నట్స్‌లో ఒమెగా 7 తోపాటు ఒమెగా 9 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా ఉండేలా చేస్తాయి. దీంతో మతిమరుపు తగ్గుతుంది. చిన్నారులు అయితే చురుగ్గా పనిచేస్తారు. మెదడు యాక్టివ్‌గా మారి చదువుల్లో రాణిస్తారు. తెలివితేటలు పెరుగుతాయి. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలు ఉన్నవారు ఈ నట్స్‌ను తింటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ నట్స్‌ను తినడం వల్ల మూడ్ మారుతుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది.

బరువు తగ్గేందుకు..: అధిక బరువు ఉన్నవారికి ఈ నట్స్‌ను వరం అనే చెప్పవచ్చు. ఈ నట్స్‌లో క్యాలరీలు, కొవ్వులు అధికంగా ఉన్నప్పటికీ ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బరువు తగ్గేలా చేస్తాయి. రోజూ గుప్పెడు మెకడేమియా నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే శరీరంలోని కొవ్వు కరుగుతుందని, అధిక బరువు తగ్గుతారని సైంటిస్టులు చేపట్టిన పరిశోధనల్లో తేలింది. ఈ నట్స్ వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడి కొవ్వు కరుగుతుంది. ఫలితంగా బరువు తగ్గి నియంత్రణలో ఉంటుంది. మెకడేమియా నట్స్‌ను తింటే జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల షుగర్ లెవల్స్‌ను సైతం తగ్గించుకోవచ్చు. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా మెకడేమియా నట్స్ వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# ప్రకృతి మనకు అందించిన వరం.. నేరేడు చెట్టు..

## దీని ఆకులతో ఏయే లాభాలు కలుగుతాయంటే..?



ఈ సీజన్‌లో మనకు అధికంగా లభించే పండ్లలో నేరేడు పండ్లు కూడా ఒకటి. గ్రామీణ ప్రాంతాల్లో మనకు ఇవి విరివిగా లభిస్తాయి. చాలా మంది ఇళ్లలో చెట్లు ఉంటాయి కనుక డబ్బు పెట్టకుండానే ఈ పండ్లను తినవచ్చు. నగరాలు, పట్టణాల్లో ఉండేవారు తమకు అందుబాటులో ఉన్న వర్తకుల వద్ద ఈ పండ్లను కొని తినాల్సి ఉంటుంది. అయితే ఈ పండ్లు అందించే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. ఇక నేరేడు పండ్లు మాత్రమే కాదు ఈ చెట్టు ఆకులు కూడా మనకు ఎంతగానో పనిచేస్తాయి. ముఖ్యంగా ఆయుర్వేద ప్రకారం ఈ ఆకుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఇవి మనకు కలిగే వ్యాధులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. నేరేడు ఆకులతో అనేక రకాల అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

షుగర్ నియంత్రణకు..: డయాబెటిస్ ఉన్నవారికి నేరేడు ఆకులు ఒక వరంగానే చెప్పవచ్చు. నేరేడు ఆకుల్లో జాంబోలైన్, జాంబోసైన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర నెమ్మదిగా విడుదల అయ్యేలా చేస్తాయి. దీంతో షుగర్ కంట్రోల్ అవుతుంది. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. నేరేడు ఆకులను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. నేరేడు ఆకుల నుంచి రసం తీసి పావు టీస్పూన్ మోతాదులో భోజనానికి ముందు సేవించవచ్చు. లేదా ఈ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు 2 సార్లు భోజనానికి 30 నిమిషాల ముందు ఒక కప్పు మోతాదులో తాగుతుండాలి. ఇలా చేస్తుంటే డయాబెటిస్ అదుపులో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

జీర్ణ సమస్యలకు..: నేరేడు ఆకుల్లో ఉండే సమ్మేళనాలు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. నేరేడు ఆకులతో తయారు చేసిన నీళ్లను తాగితే విరేచనాల నుంచి బయట పడవచ్చు. పేగుల్లో మలం సరిగ్గా కదులుతుంది. మలబద్దకం సైతం తగ్గుతుంది. నేరేడు ఆకుల నీళ్లను తాగడం వల్ల జీర్ణాశయంలో పలు ఎంజైమ్‌లతోపాటు బయో యాక్టివ్ సమ్మేళనాలు ఉత్పత్తి అవుతాయి. ఇవి కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి, అసిడిటీ వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. నేరేడు ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నోరును ఆరోగ్యంగా ఉంచుతాయి. నేరేడు ఆకులను నేరుగా నమిలి తింటుండాలి. దీంతో నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి.

ఆర్థ్రైటిస్ నొప్పులకు..: నేరేడు ఆకుల్లో ఉండే బయో యాక్టివ్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్స్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా కూడా పనిచేస్తాయి. అందువల్ల ఈ ఆకులతో తయారు చేసిన నీళ్లను తాగుతున్నా లేదా ఈ ఆకుల పేస్ట్‌ను వేసి కట్టు కడుతున్నా ఆర్థ్రైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. వాపులు కూడా తగ్గుతాయి.

అలాగే నేరేడు ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకోవచ్చు. నేరేడు ఆకుల నీళ్లను రోజూ తాగడం వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. ఇలా నేరేడు పండ్లు మాత్రమే కాదు, నేరేడు చెట్టు ఆకులు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి.

# రెండు లక్షల మందికి ఉద్యోగాలు

**విశాఖపట్టణం,(తెలంగాణ దిశ):** విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కూడా జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఒక గిగావాట్ డేటా సెంటర్ ను విశాఖలో గూగుల్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఐదేళ్లలో లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనుంది. అయితే గూగుల్ కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే మూడు ప్రాంతాలను ఎంపిక చేసింది. ముడసర్లోవ, తర్లువాడ, రాంభిల్లి మండలంలోని భూములను గూగుల్ కోసం కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో గూగుల్ ప్రతినిధులు ఆ ఆయా ప్రాంతాలలో పర్యటిస్తున్నారు.విశాఖపట్నంలో గూగుల్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్న సంగతి తెలిసిందే. ఐదేళ్లలో సుమారుగా లక్షా 33 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ఢిల్లీలో ఇటీవల ఏపీ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకు గూగుల్ సంస్థ విశాఖలో వేయి మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసంవిశాఖలోస్థల పరిశీలన జరుగు తోంది.గూగుల్ సంస్థ ప్రతినిధులువిశాఖలో పర్యటిస్తున్నారు. అనువైన ప్రాంతం కోసం అన్వేషిస్తున్నారు. గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం తర్లువాడ, ముడసర్లోవ ప్రాంతాలతో పాటుగా అనకాపల్లిలో జిల్లాలోని రాంబిల్లి మండలంలోని భూములను కూడా కేటాయించనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ కన్సల్టెంట్లు.. ఏపీ ప్రభుత్వం కేటాయించిన భూములను పరిశీలించారు. విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర రెవెన్యూ అధికారులతో చర్చించారు. గూగుల్‌కు కేటాయించిన భూములలో సర్వే చేపట్టి అనంతరం హద్దులను నిర్దేశించనున్నారు. గూగుల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములలో తొలుత తర్లువాడ వద్ద పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ముడసర్లోవ వద్ద గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం కేటాయించే భూములు.. సింహాచలం ఆలయానికి చెందినవి. దీంతో దేవస్థానంతో చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రాంబిల్లిలోని భూములు నౌకాదళం కేంద్రానికి సమీపంలో ఉన్నాయి. దీంతో నౌకాదళం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న మీదట.. తర్లువాడ వద్ద భూములు సిద్ధంగా ఉండటంతో అక్కడే తొలుత పనులు ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ పోలీస్ భద్రతను కూడా పెంచారు.త్వరలోనే సర్వే చేపట్టనున్నారు. ఆ తర్వాత ఫెన్సింగ్ నాటే అవకాశాలు ఉన్నాయిమరోవైపు విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న గూగుల్ సంస్థ.. ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. గూగుల్ పెట్టుబడుల ద్వారా విశాఖపట్నం ఏఐ హబ్‌గా మారుతుందని ప్రభుత్వం చెప్తోంది. మరోవైపు అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద డేటా సెంటర్ కూడా ఇదే కావటం విశేషం. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఏపీ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి 2028-32 మధ్య కాలంలో ఏటా రూ.10,518 కోట్లు సమకూరుతుందని అంచనా.అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,88,220 ఉద్యోగాలు వస్తాయని చెప్తున్నారు. మరోవైపు డేటా సెంటర్ వలన ఎక్కువగా ఉద్యోగాలు రావని వైసీపీతో పాటు మరికొందరి వాదన. కేవలం డేటా స్టోరేజీ కోసం మాత్రమే ఉపయోగిస్తారని.. దీనితో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు రావటం కష్టమంటున్నారు. అయితే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ పె ట్టుబడులతో మరిన్ని కంపెనీలు విశాఖకు వచ్చే అవకాశం ఉంటుందని.. ప్రభుత్వం చెప్తోంది.

# ఇండిగోకు కేంద్రం షాక్..




**ముంబై,:** ఇటీవల 2 వేలకు పైగా విమానాలు రద్దు కావడంతో తలెత్తిన సంక్షోభం దృష్ట్యా.. కేంద్రం ఇండిగో సంస్థకు భారీ షాక్ ఇచ్చింది. ఇండిగో సంస్థ 10 శాతం విమానాలను తగ్గించాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది. దీంతో రోజుకు 200 ఇండిగో విమానాలు నిలిచిపోనున్నాయి. అయినప్పటికీ.. అన్ని మార్గాల్లో తమ సర్వీసులను కొనసాగిస్తామని ఇండిగో ప్రకటించింది.దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో సంస్థకు సంబంధించి.. ఇటీవల నెలకొన్న సంక్షోభం ఇప్పుడిప్పుడే సద్దుమణిగిపోతోంది. పూర్తి స్థాయిలో కార్యకలాపాలను సాగించేందుకు.. అన్ని రకాలుగా కృషి చేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇక వేలాది విమానాలు రద్దు కావడం వల్ల.. వేల మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడటం, కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇటీవల 2000కు పైగా విమానాలు రద్దు కావడంతో తలెత్తిన తీవ్ర సంక్షోభం వేళ.. కేంద్ర పౌరవిమానయాన శాఖ.. ఇండిగో సంస్థపై కొరఢా ఝుళిపించింది. ఇండిగో సంస్థ తమ మొత్తం కార్యకలాపాల్లో 10 శాతం తగ్గించుకోవాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది కొద్ది రోజులుగా ఇండిగో విమానాలు భారీ సంఖ్యలో రద్దు కావడం, ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి ప్రధానంగా సిబ్బంది రోస్టర్ నిర్వహణలో లోపాలు.. కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలకు అనుగుణంగా.. ఇండిగో సంస్థ తమ షెడ్యూల్‌ను మార్చుకోకపోవడం కారణమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు.. స్వయంగా పార్లమెంటు వేదికగా ప్రకటన చేశారు. ఇండిగో సంస్థ కార్యకలాపాలను మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావడానికి.. విమానాల రద్దులను తగ్గించడానికి ఈ 10 శాతం సర్వీసుల కోత అవసరమని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ భావించింది. అయితే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మాత్రం.. మొదట్లో 5 శాతం సర్వీసుల కోత విధించాలని నిర్ణయించగా.. తాజాగా విమానయాన మంత్రిత్వ శాఖ మాత్రం దాన్ని 10 శాతానికి పెంచింది.ఇండిగో సంస్థ.. రోజుకు దాదాపు 2200 విమానాలను నడుపుతుంది. తాజా 10 శాతం తగ్గింపు వల్ల.. 200కు పైగా విమానాలు రద్దు కానున్నాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలను పాటించాలని ఆదేశిస్తూ.. ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్‌ను మంత్రిత్వ శాఖ కార్యాలయానికి పిలిపించారు.కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశించిన 10 శాతం సర్వీసుల కోతకు తాము కట్టుబడి ఉన్నామని.. ఇండిగో సంస్థ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేసింది. ఈ 10 శాతం విమానాలు నడవకపోయినా.. ఇండిగో సంస్థ తన అన్ని గమ్యస్థానాలను మునుపటిలాగే కవర్ చేస్తుందని తెలిపింది.కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇండిగో సంస్థకు పలు ఆదేశాలు జారీ చేసింది. విమాన టికెట్ ధరలపై పరిమితిని పాటించడం.. విమాన ప్రయాణికుల సౌకర్యం కోసం చర్యలు తీసుకోవడం.. డిసెంబర్ 6వ తేదీ వరకు ప్రభావితమైన విమానాలకు 100 శాతం రీఫండ్‌లు పూర్తి అయ్యాయని ఇండిగో ధృవీకరించింది. మిగిలిన రీఫండ్‌లు, లగేజీని అప్పగించే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కఠినమైన సూచనలు జారీ చేశారు. ఈ విషయంలో దర్యాప్తు ప్రారంభించి విమానయాన సంస్థ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో ప్రకటించారు. దర్యాప్తులో తేలిన విషయం ఆధారంగా ఇండిగో సంస్థపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మరోవైపు.. ఈ సంక్షోభం నుంచి బయటపడడానికి తమ కార్యకలాపాలు ఇప్పుడు గాడిన పడుతున్నాయని ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ అంతకుముందు ట్వీట్ చేసినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

# పాత జిల్లాలోనే కలిపేయండి

**కర్నూలు,తెలంగాణ దిశ :** ఏపీలో జిల్లాల పునర్విభజన వేళ డోన్ నియోజకవర్గ ప్రజలు తమను నంద్యాల నుంచి కర్నూలు జిల్లాలో కలపాలని కోరుతున్నారు. వైద్య, ఉపాధి అవసరాలకు కర్నూలు దగ్గరగా ఉండటమే దీనికి కారణం. గతంలోనూ కర్నూలు జిల్లాలోనే ఉన్న డోన్ వాసులు, ఈ మార్పు తమకు సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కూడా ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.ఏపీలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్విభజన, మండలాల పునర్విభజనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మరో డిమాండ్ తెరపైకి వచ్చింది. తమను నంద్యాల జిల్లా నుంచి తీసుకెళ్లి కర్నూలు జిల్లాలో కలిపేయాలని డోన్ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. డోన్ నియోజకవర్గం నంద్యాల జిల్లాలో కలపడాన్ని అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గతంలో డోన్ నియోజకవర్గం కర్నూలు జిల్లాలోనే ఉండేది. దీంతో డోన్ వాసులు చిన్న అనారోగ్య సమస్యలు వచ్చినా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా కర్నూలులోని పెద్దాసుపత్రికి వెళ్లేవారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, నిరుద్యోగులు, కూలీలు కూడా ఉపాధి, ఉద్యోగాల కోసం కర్నూలుకు వెళ్లేవారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నంద్యాల జిల్లాలోకి విలీనం అయింది. ఈ మార్పును వ్యతిరేకిస్తూ అప్పట్లోనే ప్రజలు అనేక విజ్ఞప్తులు చేశారు.డోన్ నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు. 2 లక్షలకు పైగా ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో, డోన్ పట్టణ, మండలాల నుంచి 90 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. చారిత్రాత్మకంగా, డోన్ ప్రాంతం నుంచి ఎన్నికైనవారు రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులు కూడా చేపట్టారు. ప్రస్తుతం, డోన్‌ను కర్నూలు జిల్లాలో కొనసాగించాలని కోరుతున్నారు. డోన్ నుంచి కర్నూలుకు హైవే మార్గంలో కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉంది.. 50 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. అయితే నంద్యాల జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 90 కిలోమీటర్లు ప్రయాణించి గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది.డోన్ ప్రాంత ప్రజలు వైద్య అవసరాల కోసం, ఉపాధి అవకాశాల కోసం కర్నూలు దగ్గరగా ఉండటంతో అక్కడికే వెళ్లడం సౌకర్యంగా ఉందంటున్నారు. నంద్యాలకు కేవలం జిల్లా అధికారులతో పనులుంటేనే వెళ్తున్నారట. ప్యాపిలి మండల ప్రజలు కూడా తమ ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలోనే ఉంచితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. డోన్, ప్యాపిలి ప్రాంతాల ప్రజల్లో 95 శాతం మందికి పైగా తమ ప్రాంతాలను కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు.డోన్ ప్రజలు కోరుకున్నట్లుగానే కర్నూలు జిల్లాలో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో కూడా హామీ ఇచ్చామని.. ఇప్పటికే జిల్లాల పునర్విభజనపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం, ముఖ్యమంత్రికి సైతం లేఖను అందజేశామని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ లోపు ఈ జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నారు. మరి డోన్‌వాసుల రిక్వెస్ట్‌ను పరిగణలోకి తీసుకుంటారలో లేదో చూడాలి. మరి డోన్ ప్రజల రిక్వెస్ట్‌పై ప్రభుత్వం, కేబినెట్ సబ్ కమిటీ ఎలా స్పందిస్తుందో చూడాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని డోన్‌వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


# ఒంగోలు పట్టణ వ్యాపారుల లబోదిబో

## వరదలతో పూర్తిగా కొట్టుకుపోయిన సరుకులు ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

**ఒంగోలు,తెలంగాణ దిశ :**మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు ఉమ్మడి ప్రకాశం జిల్లాను అతలాకుతలం చేశాయి. అన్నదాతలతో పాటు, సామాన్యులు కూడా దెబ్బతిన్నారు. ముఖ్యంగా వీధి వ్యాపారుల అవస్థలు చెప్పలేం. ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాధగా ఉంది. చిరు వ్యాపారులను తుఫాన్ వర్షం నిలువునా ముంచింది. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో ఊహించని విధంగా భారీఎత్తున వరద నీరు ముంచెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కిరణా సామగ్రి విక్రయదారులు, దర్జీలు, తినుబండరాలు అమ్మేవారు, మోటారు మెకానిక్‌లు ఇలా చేతివృత్తులదారులందరూ తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు. అల్పపీడనం, అనంతరం మొంథా తుపాను ప్రభావంతో గత పది రోజులుగా కురిసిన భారీ వర్షాలతో వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగాయి. వర్షాలకు జన సంచారం తగ్గి అమ్మకాలు సాగక చిరు వ్యాపారులకు పూట గడవని పరిస్థితి నెలకొంది. తొలుత ఎలాంటి వరద లేకపోవడంతో ఎప్పుడూ వచ్చే మాదిరి వరద నీరు వచ్చి పోతుందని పెద్దగా జాగ్రత్తలు తీసుకోలేదు. చాలామంది సామగ్రి సర్దుకోలేదు. చాలామంది దుకాణం ఒకచోట, నివాసం మరోచోట ఉండటంతో సామగ్రిని భద్రపరచుకోలేకపోయారు. భారీఎత్తున వరద నీరు చుట్టుముట్టేయడంతో దుకాణాల్లో నీరు చేరింది. దీంతో సామగ్రి పూర్తిగా తడిసిపోయి ఎందుకూ పనికిరాకుండాపోయాయి. వరదతో దుకాణంలో బురద మేటలు వేసిందని, దీంతో తీవ్రంగా నష్టపోయినట్లు వివరించారు. వస్తువులను తయారు చేసే చిన్న ఖార్ఖానాలను వరద నీరు ముంచెత్తడంతో వారంతా నష్టపోయారు. ప్రధానంగా ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువను ఆనుకుని ఉన్న కాలనీల్లో చిరు వర్తకులకు తీవ్ర నష్టం ఎదురైంది.

నష్టాన్ని పరిశీలించి తమకు సాయం చేయాలని వారంతా కోరుతున్నారు. ఒంగోలు నగరం మెంథా దెబ్బకు జలవిలయాన్ని సృష్టించంది. నగరం మొత్తం నీట మునిగింది. దీంతో చిన్నాచితక వ్యాపారాలు చేసేవారి సామాగ్రి నీట మునిగిపోవడం లేదా కొట్టుకుపోవడం జరిగింది. బలరాం కాలనీకి వెళ్లే దారిలో వంతెన వద్ద సమోసాలు హోల్‌సేల్‌గా విక్రయించే దుకాణంలో పిండి బస్తాలు తడిచిముద్దయి పనికి రాకుండాపోయాయి. ఇదే ప్రాంతంలో పాత సామగ్రి కొనుగోలు దుకాణంలోని మొత్తం సరకు కొట్టుకుపోయినట్లు వ్యాపారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు వర్షం కురిసినా మోకాలి లోతున నీళ్లు వస్తుంటాయని, ఆమేర జాగ్రత్త పడతామని ఈసారి ఊహించని విధంగా వరద ముంచేసిందని ఓ కిరాణా వ్యాపారి వాపోయారు. ఇటీవల కాలంలో ఇంత వరద తామెప్పుడూ చూడలేదని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు.

# వైజాగ్ లో రహేజ పెట్టుబడులు





**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** విశాఖలో ఇదివరకే గూగుల్, టీసీఎస్ డేటా సెంటర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాయి. పలు కొత్త సంస్థలు, ఐటీ కంపెనీలు నగరానికి వస్తే త్వరలోనే విశాఖ రూపురేఖలో మారనున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ నిర్మాణ సంస్థ కె.రహేజా కార్పొరేషన్ విశాఖలో ఇన్వెస్ట్ చేయడానికి నిర్ణయం తీసుకుంది. విశాఖలో త్వరలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లు, ఐటీ సంస్థలకు అవసరమైన వాణిజ్య, నివాస భవనాల సముదాయాలు నిర్మించేందుకు రహేజా సంస్థ పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా దాదాపు 28.65 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి వస్తుందిఈ ప్రాజెక్టు విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి, ఉత్పాదకత పెరుగుదలకు, అలాగే ఉద్యోగ అవకాశాలు సృష్టించడానికి వీలుంటుంది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ రూ.2,172.26 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. మధురవాడ ఐటీ హిల్ నంబరు-3లో 27.10 ఎకరాలు భూమిని ప్రాజెక్టు కోసం కేటాయించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 9,681 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని రహేజా సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనలో పేర్కొంది.విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఇటీవల ఢిల్లీలో సంస్థ ప్రతినిధులతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. గూగుల్ సంస్థ ఏపీలో ఏకంగా 1.33 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ప్రాజెక్టు ప్రారంభంతో పలు ఐటీ, దాని అనుబంధ సంస్థలు నగరానికి రాబోతున్నాయి. ఈ సంస్థల ఏర్పాటుకు ఆఫీసు స్థలాలు కావాలి. ప్రస్తుతం మిలీనియం టవర్ 1, 2లో సుమారు 6 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలం టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలకు కేటాయించారు. విశాఖకు కొత్తగా రాబోతున్న కంపెనీలకు కార్యాలయ స్థలాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రహేజా సంస్థ చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 28.65 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఆఫీసు కార్యాలయాల కోసం అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టు విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి, ఉత్పాదకత పెరుగుదలకు, అలాగే భారీ ఉద్యోగ అవకాశాలు సృష్టించడానికి దోహదపడనుంది.మొదటి దశలో 2028 నాటికి వాణిజ్య భవనాలను, నివాస సముదాయాలను 2030 నాటికి పూర్తి చేయాలని రహేజా సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు పనుల కోసం రూ.663.42 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఫస్ట్ ఫేజ్ ప్రాజెక్టు పనులతో 9.59 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి రానుందిరెండో దశలో 2031 నాటికి వాణిజ్య భవనాలను, 2035 నాటికి నివాస సముదాయాలను పూర్తిచేసేందుకు రహేజా సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రెండో దశలో రూ.1,418.84 కోట్లు వెచ్చించనుంది. తద్వారా 19.06 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి తెస్తామని సంస్థ ఏపీ ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనల్లో పేర్కొంది.

# మూసీ ప్రక్షాళనకు అడగడుగునా అడ్డంకులు



**నల్గొండ,తెలంగాణ దిశ :**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటైన మూసీ ప్రాజెక్ట్ ఆధునీకరణకు నోచుకోక అంధకారంలో కొట్టుమిట్టాడుతుంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మూసీ ప్రాజెక్టు పరిస్థితి ఉంది. సోలిపేట గ్రామం వద్ద మూసీనదిపై 1954 సంవత్సరంలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 1963 సంవత్సరంలో పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన ఐదేళ్ల వరకు ఎడమ కాలువ 41 కిలోమీ టర్లు, కుడికాలువ 38 కిలోమీటర్ల పొడవున మొత్తం 42 గ్రామాల రైతులకు సాగునీరందించింది.ప్రస్తుతం ప్రాజెక్టులో పూడిక పెరిగిపోవడంతో 30 వేల ఎకరాలకు ఆయకట్టుకు పడిపోయింది. పాలకులు మారుతున్న మూసీ ప్రాజెక్టు పై నిర్లక్ష్యం మాత్రంవీడటం లేదు. ప్రాజెక్టు మీద నిర్మించిన రక్షణ గోడలకు రక్షణ లేకుండా పోయింది.. వెదురు కర్రలేదిక్కయ్యాయి. పర్యాటకులతో, అతిధులతో కిటకిటాడాల్సిన అతిథిగృహం శిధిలావస్థలో ఉంది. క్లస్టర్ గేట్ల నుండి ,ప్రాజెక్టు రక్షణ గోడల నుండి నుండి నీరు లీకేజ్ అవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు.ప్రాజెక్టుపై ఆరుగురు పర్మనెంట్ ఉద్యోగులు, నలుగురు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కేటాయించే నిధులు సరిపోక మరమ్మతులు పూర్తి స్థాయిలో జరగటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉమ్మడి జిల్లా మంత్రులు మూసీ ప్రాజెక్టు పై ప్రత్యేక దృష్టి పెట్టి ఆధునీకరణకు పూనుకొని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారుమూసి ప్రాజెక్ట్ 6700 ఎకరాలలో విస్తరించి ఉంది 4.46 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న ప్రాజెక్ట్ రోజురోజుకు పూడిక పెరగడంతో సామర్థ్య స్థాయి తగ్గిపోతుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలో నకిరేకల్, సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడెం నియోజకవర్గాలకు సాగునీరు అందుతుంది.కుడి కాల్వ పరిధిలో కేతేపల్లి, మాడ్గులపల్లి, తిప్పర్తి, వేములపల్లి మండలాల్లో 23 చెరువులు, ఎడమ కాలువ పరిధిలో సూర్యాపేట, చివ్వెంల, పెన్ పహాడ్ మండలాల్లో 22 చెరువులు ఉన్నాయి. కాలువలకు నీటిని విడుదల చేసి నట్లయితే చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండుతాయి. కుడి, ఎడమ కాల్వల కు నీటిని విడుదల చేస్తే ఆయకట్టు పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల ఎకరాల భూము లు సాగులోకి రానున్నాయి. ప్రాజెక్టు మీద ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు శిథిలవస్థకు చేరాయి. రక్షణ గోడలకు మరమ్మత్తులు చేపట్టలేదు. రక్షణ గోడలు శిథిలమైన స్థానంలో కర్రలు కట్టి మమ అనిపించారు. ప్రాజెక్టు కు సందర్శకులు వచ్చినప్పుడు వారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న వెదురు కర్రలు విరిగే ప్రమాదం ఉంది. మూసీ ప్రాజెక్టుకు 30 స్కవర్, క్రష్, రెగ్యులేటర్ గేట్లు ఉన్నాయి. వీటిలో 10 స్కవర్ గేట్లను శాశ్వతంగా మూసివేశారు. ఎనిమిది క్రష్ గేట్లలో మూడు గేట్ల నుండి నీరు లీకేజీ రూపంలో వాగులోకి వెళ్తుంది. దశాబ్దన్నర కాలంగా గేట్ల నుంచి నీరు లీకేజి అవుతున్న మరమ్మతులకు నోచుకోలేదు. మూసీ ప్రాజెక్టు డ్యాం గేట్లు ముగిసిన తర్వాత ఉన్న ప్రాంతంలో డ్యాం గోడల నుంచి సైతం నీరు లీకేజీల రూపంలో ప్రవహిస్తుంది. ఈ లీకేజీలు సంవత్సరాల తరబడి అవుతున్న పట్టించుకోవడం లేదు. లీకేజీల వెంబడి చెట్లు పెరిగి ఆ గోడను మరింత బలహీన పరుస్తున్న పరిస్థితి ఉంది.గతంలో పర్యాటకులు, అతిధులతో కలకలలాడిన అతిథి గృహం నేడు వెలవెలబోతుంది. అతిథి గృహానికి మరమ్మత్తులు లేక శిథిలవస్థకు చేరుతుంది. అతిథి గృహం, గేట్లకు కలర్స్, ఇతర మరమ్మతుల కోసం రూ.4 కోట్ల తో ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. డ్యాం రక్షణ, మరమ్మతుల కోసం రూ. 75 లక్షలతో ప్రభుత్వం నుండి సాంక్షన్ ఆర్డర్స్ వచ్చాయి కానీ సాంక్షన్ ఆర్డర్స్ వచ్చిన టెండర్లకు ఎవరు ముందుకు రాలేదని త్వరలో మళ్లీ టెండర్ వేసి మరమ్మతులు చేపడతామని ప్రాజెక్టు డి ఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రెండో ప్రాజెక్ట్ అయిన మూసి ప్రాజెక్టును పర్యటకేంద్రంగా అభివృద్ధి చేయడానికి అన్ని వసతులు ఉన్నాయి. ఆహ్లాదకర వాతావరణం, పర్యాటకుల సందడి, హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి, చుట్టుపక్కల ప్రకృతి అందాలు పర్యాటక కేంద్ర అభివృద్ధికి కావలసిన అన్ని అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం స్పందించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# 66వేల పెట్టుబడి.. 660 రూపాయిల ఆదాయం



ముంబై, : ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉల్లి రైతులకు కోయకుండానే కన్నీళ్లు వస్తున్నాయి. పెట్టిన పెట్టుబడిలో పదో వంతు కూడా వారి చేతికి రావడం లేదు. కనీసం పంటను మార్కెట్‌కు తరలించిన ఖర్చులు కూడా రాకపోవడంతో.. అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడం.. చేతికొచ్చిన ఆ మాత్రం పంటకు రేటు లేకపోవడంతో భారీ నష్టాలను చవిచూస్తున్నా రు. మరికొందరు రైతులు.. పంటను కోసి, వాటిని మార్కెట్‌కు తీసుకెళ్లినా ఆ ఖర్చులు కూడా రావడం లేదని.. పంటను కోయకుండా అలాగే పొలాల్లో వదిలేస్తున్నారు.మహారాష్ట్ర రైతు సుదామ్ ఇంగ్లే ఉల్లి సాగు కోసం రూ.66 వేల పెట్టుబడి పెట్టారు. భారీ వర్షాల కారణంగాపంట దెబ్బతినడంతో.. 7.5 క్వింటాళ్ల ఉల్లి పంట మాత్రమే వచ్చింది. ఆ ఉల్లి పంటను మార్కెట్‌కు తరలించగా.. రవాణా ఖర్చులు పోను ఆయనకు కేవలం రూ. 664 మాత్రమే మిగిలాయి. పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో ఆవేదన చెందిన సుదామ్ ఇంగ్లే.. మిగిలిన పంటను అమ్మడం కంటే పొలానికి ఎరువుగా మార్చడమే మేలు అని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఎడతెరిపి లేని వర్షాలు, ధరలు భారీగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని.. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతుల ఆత్మహత్యలు పెరుగుతా యని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఈ దయనీయ పరిస్థితి మహారాష్ట్ర లోని ఉల్లి, టమోటా, సోయాబీన్ వంటి అనేక పంటలు సాగు చేసే రైతులందరిదీ అని ఈ వార్త తెలియజేస్తోంది. పంట కోసం ఆరుగాలం శ్రమించిన అన్నదాతలకు ఈసారి మిగిలింది కన్నీరేనని తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతోంది. పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి రాకపోగా.. కనీసం మార్కెట్‌కు పంటను తరలించిన రవాణా ఖర్చులూ దక్కని దయనీయ పరిస్థితి మహారాష్ట్ర రైతన్నలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.మహారాష్ట్ర పూణే సమీపంలోని పురందర్‌కు చెందిన రైతు సుదామ్ ఇంగ్లే.. తన పొలంలో ఉల్లి సాగు కోసం సుమారు రూ.66 వేలఖర్చు చేశారు. అయితే ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతింది. అయినప్పటికీ.. కొంత భాగాన్ని కాపాడి దాన్ని బస్తాల్లో నింపి.. రూ.1,500 ఖర్చు చేసి పురందర్ మార్కెట్ యార్డుకు తరలించారు.అక్కడ 7.5 క్వింటాళ్ల ఉల్లిపాయలను విక్రయించగా.. రవాణా, లోడింగ్ ఖర్చులు (రూ. 1,065) పోను ఆయన చేతికి వచ్చింది కేవలం రూ. 664 మాత్రమే. అంటే రూ.66 వేలు ఖర్చు పెడితే కనీసం వెయ్యి రూపాయలు కూడా మిగలలేదు. ఆ రైతు అమ్మిన ఉల్లిపాయలు నష్టం ఆధారంగా కిలోకు రూ. 3, రూ. 2, రూ. 10 చొప్పున అమ్ముడుపోయాయని తెలుస్తోంది.తనకు జరిగిన నష్టాన్ని చూసి సుదామ్ ఇంగ్లే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక ఎకరం భూమి నుంచి వచ్చిన పంట మాత్రమేనని.. తనకు మరో ఒకటిన్నర ఎకరాల్లో ఉల్లి పంట ఉందని పేర్కొన్నారు. దాన్ని మార్కెట్‌కు తీసుకెళ్లి మరింత నష్టపోవడం కంటే.. రోటవేటర్ వేసి పొలానికి ఎరువుగా మార్చేస్తానని చెప్పారు. అమ్మడం కంటే అదే లాభదాయకమని వాపోయారు. తన లాంటి పెద్ద రైతులపరిస్థితే ఇలా ఉంటే..అప్పులు చేసి సాగుచేస్తున్నచిన్న రైతులు ఎలా బతకాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించక పోతే రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతాయని ఆయన హెచ్చరించారు. మహారాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలు.. పడిపోతున్న ధరలు అన్నదాతల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఉల్లిపాయలు, టమోటాలు, బంగాళాదుంపల నుంచి దానిమ్మ, సీతాఫ లం, సోయాబీన్ వరకు దాదాపు ప్రతీ పంట పండించిన రైతుకు ఈ సీజన్‌లో ఇలాంటి పరిస్థితే ఎదురైందని చెబుతున్నారు. నాసిక్ ప్రాంతంలో ఏకంగా 80 శాతం ఉల్లిపాయ పంట వర్షాల కారణంగా దెబ్బతినగా.. కాపాడిన పంట కూడా నాణ్యత లేకపోవడం వల్ల అతి తక్కువ ధరలకు అమ్ముడవుతోంది. చేతిలో డబ్బు లేకపోవడంతో రైతులు కొనుగోలు శక్తిని కోల్పోయారు. దీంతో గ్రామీణ మార్కెట్లలో దీపావళి కళ పూర్తిగా కరువైంది. నగరాల్లో మాత్రమే దీపావళి వేడుకలు జరుగుతున్నాయని.. పల్లెల్లో దీపం కొనుక్కోవడానికి కూడా డబ్బు లేదని పేర్కొంటున్నారు.రైతులు ప్రభుత్వ విధానాలను కూడా తప్పుబట్టారు. 2023లో ఉల్లి ధరలు పెరిగినప్పుడు కేంద్రం ఎగుమతులను నిషేధించడం వల్ల ఇతర దేశాలు అంతర్జాతీయ మార్కెట్‌ను ఆక్రమించాయని, దీనివల్ల భారతదేశం తమ ఎగుమతి వాటాను కోల్పోయిందని ఆరోపించారు. ధరలు పెరిగినప్పుడు ఎగుమతిని నిషేధించిన ప్రభుత్వం.. మార్కెట్ ధరలు కుప్పకూలిన ప్పుడు గిట్టుబాటు ధర ఇచ్చి ఉల్లి పంటను కొనుగోలు చేయదా అని ప్రశ్నించారు. వ్యవసాయం అంటే కష్టాల జీవితమేనా అని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

# నక్వీకి వార్నింగ్

ముంబై, : పాకిస్తాన్ దేశమే కాదు.. అక్కడి పాలకులు కూడా దుర్మార్గులే. ఇది అనేక సందర్భాల్లో నిరూపితమైంది. ఇప్పుడు కూడా నిరూపితం అవుతోంది. చివరికి క్రికెట్ జట్టును పర్యవేక్షించే వ్యక్తులు కూడా దుర్మార్గంగానే వ్యవహరిస్తున్నారు. భారత్ మీద విషాన్ని కక్కుతున్నారు. ప్లేయర్లు మాత్రమే కాదు.. బోర్డును పర్యవేక్షించేవారు కూడా ఇలా వ్యవహరించడం పట్ల యావత్ క్రికెట్ ప్రపంచం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.ఇటీవల ఆసియా కప్ జరిగింది. ఇందులో టీమిండియా ఫైనల్ మ్యాచ్లో పాకిస్తాన్ జట్టుపై అద్భుతమైన విజయం సాధించింది. ట్రోఫీ అందుకునే విషయంలో టీమిండియా నిరసన వ్యక్తం చేసింది. పహల్గాం దాడి, సరిహద్దు వద్ద ఉద్రిక్తతలు వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని టీమిండియా ఏసిసి చీఫ్, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మోసిన్ నక్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకోవడానికి ఆసక్తిని ప్రదర్శించలేదు. టీమిండియా ప్లేయర్ల నిరసన నేపథ్యంలో ఏసిసి చీఫ్ ఆసియా కప్, మెడల్స్ తన వెంట తీసుకొని పోయారు.నక్వీ వ్యవహరిస్తున్న తీరు పట్ల భారత క్రికెట్ మేనేజ్మెంట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆసియా కప్ ఫైనల్ జరిగిన రెండు రోజుల తర్వాత ఏసిసి ఏజీఎం సమావేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాదు ఏసిసి చీఫ్ కు గట్టి హెచ్చరికలు పంపించింది. ట్రోఫీ సరైన విధానాల్లో పంపించాలని.. లేకపోతే పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. కాదు అధికారిక ఈమెయిల్ ద్వారా కూడా సందేశం పంపించింది. అయితే ఇప్పటివరకు ఏసీసీ చీఫ్ నుంచి ఎటువంటి ప్రత్యుత్తరం రాలేదు. దీంతో ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలికి తెలియజేస్తామని ఇప్పటికే భారత క్రికెట్ యాజమాన్యం ప్రకటించింది. ట్రోఫీని తమ వద్దకు ఎలా రప్పించుకోవాలో తెలుసని.. ఎందుకు దశలవారీగా ముందుకు సాగుతామని భారత క్రికెట్ యాజమాన్య ప్రకటించింది.. అయితే ఏసిసి కార్యాలయంలో భారత జట్టుకు ట్రోఫీ అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని నక్వీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఏసిసి చీఫ్ గా మాత్రమే కాకుండా, నక్వీ పాకిస్తాన్ మంత్రిగా కూడా ఉన్నారు. దీంతో అతని చేతుల మీదుగా ఎట్టి పరిస్థితుల్లో ట్రోఫీని తీసుకునే పరిస్థితి లేదని బీసీసీ స్పష్టం చేసింది. అయితే అంతర్జాతీయ మీడియాలో వస్తున్న కథనాల ప్రకారం ఆసియా కప్ దుబాయ్ లోని ఏసీసీ కార్యాలయంలోనే ఉందని తెలుస్తోంది. అయితే ఆ ట్రోఫీని తన అనుమతి లేకుండా బయటికి తరలించకూడదని.. ఇతరులకు అప్పగించకూడదని నక్వీ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

# ఎంపీగానే రాఘవరెడ్డి పోటీ...

ఒంగోలు, : ఊహించిందే జరిగింది. ఒంగోలు ప్రజలకు అంతో క్లారిటీ ఉంది. ఆయన కూడా అదును చూసి ప్రకటన చేశారు. బర్త్ డే సందర్భంగా..సంచలన స్టేట్‌మెంట్ ఇచ్చారు ఒంగోలు టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని అంటూనే..తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేస్తారని తెలిపారు. చంద్రబాబు ఆదేశాల ప్రకారమే గత ఎన్నికల్లో తాను పోటీ చేశానని చెప్పుకొచ్చారు.మాగుంట కుటుంబ రాజకీయ వారసుడిగా రాఘవరెడ్డిని రంగంలోకి దింపాలని శ్రీనివాసులు రెడ్డి ఎప్పటి నుంచో ఆరాటపడుతున్నారు. వయస్సు మీద పడుతుండటంతో తన కుటుంబ వారసుడిని రంగంలోకి దింపేందుకు ఇదే కరెక్ట్ సమయమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లోనే టీడీపీ నుండి తన కుమారుడిని ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దింపేందుకు శతవిధాలా ప్రయత్నించారు ఎంపీ మాగుంట. మొన్నటి సారి ఎంపీగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి, గిద్దలూరు లేదా దర్శి అసెంబ్లీ నుంచి మాగుంట కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. కానీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు రాఘవరెడ్డి ఆసక్తి చూపలేదట.టీడీపీ అధిష్టానం రాఘవరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా పరిగణలోకి తీసుకున్నా.. సర్వేల్లో మాగుంట శ్రీనివాసులురెడ్డికే ప్రజలు ఓటేశారని ఆయన వైపే మొగ్గు చూపారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రాఘవరెడ్డిపై ఆరోపణలు..అరెస్టులు వంటి కీలక పరిణామాలతో తప్పని పరిస్థితుల్లో మాగుంటనే బరిలో దింపింది టీడీపీ అధిష్టానం. ఓవైపు వయోభారం..మరోవైపు తన కుమారుడి పొలిటికల్ ఎంట్రీ కోసం ఆశపడుతున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి..తన తనయుడు రాజకీయ అరంగేట్రానికి ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట. తాను రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నప్పుడే తన కుమారుడిని వారసుడిగా లైన్‌లోకి దింపి తమ కుటుంబ చరిష్మాను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉన్నారట మాగుంట. దీంతో జన్మదిన వేడుకల సందర్భంగా తన మనసులో మాటను మరోసారి బయటపెట్టారు ఎంపీ మాగుంట.రాఘవరెడ్డి ఇప్పటికే పొలిటికల్‌గా యాక్టీవ్‌గా ఉంటున్నారు. తన తండ్రి శ్రీనివాసులురెడ్డి రాజకీయ వ్యవహారాలతో పాటు వ్యాపారాల్లో చేదోడువాదోడుగా ఉంటూ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల టైమ్‌లో కూడా రాఘవరెడ్డి ప్రచారం చేశారు. మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒంగోలు పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల తర్వాత కూడా యాక్టీవ్‌గా ఉంటూ వస్తున్నారు రాఘవరెడ్డి. నియోజకవర్గాల వారీగా నేతలను కలుస్తూ..సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపుతున్నారు. అటు యువతతో..ఇటు సీనియర్ నేతలతో కోఆర్డినేట్ చేసుకుంటూ అందరికీ దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు.ఫ్యామిలీకి 30 ఏళ్ల పొలిటికల్ ట్రాక్ రికార్డు ఉంది. మాగుంట శ్రీనివాసులరెడ్డి తన సోదరుడు మాగుంట సుబ్బిరామిరెడ్డి మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చారు. 1998, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఒంగోలు నుంచి ఎంపీగా విజయం సాధించారు.

2014 ఎన్నికలప్పుడు మాగుంట కాంగ్రెస్ పార్టీకి రిజైన్ చేసి టీడీపీలో చేరి 2014లో ఒంగోలు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2015లో ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల తరుపున ఎమ్మెల్సీగా గెలిచారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి.

.2024 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి గెలిచారు మాగుంట శ్రీనివాసులురెడ్డి. ఇక ఇప్పుడు తన ఫ్యామిలీ రాజకీయ వారసత్వాన్ని కంటిన్యూ చేసేందుకు కొడుకు రాఘవరెడ్డిని బరిలోకి దింపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మరి మాగంటి వారసుడిగా రాఘవరెడ్డి పాలిటిక్స్‌లో ఎంతవరకు రాణిస్తారో చూడాలి మరి.

# రైల్వే టిక్కెట్ రీ షెడ్యూల్ అవకాశం




**హైదరాబాద్,తెలంగాణ దిశ :**దేశంలో ప్రతిరోజూ కోట్లాది మంది ప్రజలు రైలులో ప్రయాణం చేస్తున్నారు. ఈ ప్రయాణికుల కోసం రైల్వే శాఖ వేలాది రైళ్లను నడుపుతోంది. తద్వారా ప్రజలు తక్కువ ఖర్చుతో సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. అయితే, కొన్నిసార్లు ప్రయాణం ఫిక్స్ చేసుకున్నాక అనుకోకుండా మీ జర్నీ ప్లాన్ మారుతుంది. అతి కష్టమ్మీద బుక్ చేసుకున్న టికెట్ రద్దు చేసుకుంటే మళ్లీ బుక్ చేసుకోవడం కష్టమే. అందుకే మీరు టిక్కెట్‌ను క్యాన్సిల్ చేసుకోవల సిన అవసరం లేదని రైల్వేశాఖ చెబుతోంది. టికెట్ క్యాన్సిల్ సమస్యను పరిష్కరించడానికి, భారత రైల్వేశాఖ ఇప్పుడు ఒక కొత్త నియమాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, మీ జర్నీ తేదీ మారితే, టికెట్‌ను క్యాన్సిల్ చేయవలసిన అవసరం లేదు. మీరు ఇదివరకు బుక్ చేసుకున్న టికెట్‌తో మరేదైనా తేదీలో ప్రయాణించ వచ్చు. అయితే రైల్వేశాఖ ఇందుకోసం కొన్ని షరతులు విధించింది. ఈ కొత్త నియమం ఎలా పని చేస్తుంది, ఎవరికి ప్రయోజనం చేకూరుస్తుందో ఇక్కడ తెలుసుకోండి. టికెట్ బుకింగ్ సిస్టమ్‌లో పెద్ద మార్పులు చేయడానికి భారతీయ రైల్వేశాఖ సిద్ధమవుతోంది. ఇప్పుడు ప్రయాణికులు టికెట్‌ను రద్దు చేయకుండా, వారి ప్రయాణ తేదీని మార్చుకోవచ్చు. ఉదాహరణకు.. మీరు నవంబర్ 20న రైలు టికెట్ బుక్ చేసుకుంటే, జర్నీని నవంబర్ 22కి వాయిదా వేసుకోవాల్సి వస్తే.. అదే టికెట్‌ను రీషెడ్యూల్ చేయవచ్చు. ఈ సౌకర్యం ఎఖీఅఅ పోర్టల్ లేదా యాప్ ద్వారా బుక్ చేసుకున్న కన్ఫర్మ్ టిక్కెట్‌లకు మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రైల్వే ప్రయాణికులు పాత టికెట్‌ను రద్దు చేసుకుని, కొత్త టికెట్‌ను బుక్ చేసుకుంటున్నారు. తద్వారా టికెట్ క్యాన్సిల్ ఛార్జీలు చెల్లించాలి. కొత్త రూల్ ద్వారా ఈ ఇబ్బంది ఉండదు. కొత్త తేదీలో రైలు ఛార్జీలు ఎక్కువగా ఉంటే, ప్రయాణికుడు పెరిగిన ఛార్జీల వ్యత్యాసాన్ని చెల్లించాలి. ఈ మార్పు ప్రయాణికులకు రైల్వే డిజిటల్ సేవలను మరింత సౌకర్యవంతంగా చేస్తుంది.ఈ కొత్త నియమం ప్రయాణికులకు టికెట్ రద్దు చేయకుండా, వినియోగించుకునేందుకు ఉపశమనం కలిగిస్తుంది. చాలాసార్లు అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటారు. దీనివల్ల టికెట్‌ను రద్దు చేస్తే 25 శాతం నుండచి 50 శాతం వరకు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మరీ ఆలస్యమైతే ఎలాంటి రీఫండ్ కూడా ఉండదు. ఇకనుంచి రైల్వే ప్రయాణికులు తమ టికెట్‌ను రద్దు చేయకుండా ప్రయాణించాలని యోచిస్తోంది. అందుకు బదులుగా ట్రావెల్ డేట్ అప్‌డేట్ చేసుకుంటే సరిపోతుంది. రైల్వేశాఖ కొత్త రూల్ ద్వారా ప్యాసింజర్స్ సమయం, డబ్బు రెండు ఆదా అవుతాయి. కొత్త తేదీలో అదే సీటు మళ్లీ కన్ఫర్మ్ అవుతుందని కాదు. సీటు లభ్యత ఆధారంగా టికెట్ నెంబర్ మారుతుంది. నివేదికల ప్రకారం, రైలు మిస్ అయిన సందర్భంలో కూడా ప్రయాణికులకు పాక్షిక రీఫండ్ ఇవ్వాలని ప్లాన్ చేస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా విడుదల కాలేదు.

# టీచర్లకు టెన్షన్..

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత తప్పనిసరి చేసింది ఎన్‌సీటీఈ. దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లగా అత్యున్నత న్యాయస్థానం కూడా నిర్ణీత గడువులోగా టెట్ అర్హత సాధించాలని స్పష్టం చేసింది. టెట్ లేనివారికి పదోన్నతులు, ఇంక్రిమెంట్ల విషయంలో ప్రాధాన్యం ఇవ్వొద్దని పేర్కొంది. అయితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే విధుల్లో ఉన్న టీచర్లకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలన్న వినతిని ఎన్‌సీటీఈ తాజాగా పూర్తిగా తిరస్కరించింది. గతంలో ఎంపికైన ఉపాధ్యాయులకు కొంత వెసులుబాటు ఇవ్వాలని సంఘాలు, టీచర్లు రాసిన పత్రాలను తోసిపుచ్చింది.ఇటీవల సుప్రీం కోర్టు తీసుకున్న కీలక నిర్ణయం ప్రకారం, ఏ ప్రభుత్వ టీచర్ అయితే 5 ఏళ్లకు పైగా సర్వీసు పూర్తి చేశాడో, అలాంటి ప్రతీ ఒక్కరూ రెండు సంవత్సరాల వ్యవధిలో టెట్ అనివార్యంగా ఉత్తీర్ణత సాధించాల్సిందే. ఇది ఇటీవల 2017లో పార్లమెంట్‌లో దిద్దుబాటు చేసిన నిబంధనలకు అనుగుణంగా తీసుకున్న తీర్పు కావడం గమనార్హం. సుప్రీం ధర్మాసనం చెప్పిన తీర్పును 2017లో పార్లమెంట్ చేసిన తీర్మానాన్నే ఆధారంగా చూపారు. అయితే, టీచర్లు తమ నియామకాలు అంతకు ముందు జరిగాయని, కొత్త నిబంధనల ప్రభావం అందరికీ వర్తించకూడదని అభ్యర్థించినా, ఆ వాదనలను ఎన్‌సీటీఈ పరిగణనలోకి తీసుకోలేదు.టెట్ అభ్యర్థన విషయంలో వచ్చిన వినతులను ఎన్‌సీటీఈ తిరస్కరించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర నిరాశ నెలకొంది.




ఇప్పటికే విధుల్లో ఉన్నవారు కూడా టెట్ ఉత్తీర్ణత కీలకంగా మారడంతో, ఉద్యోగ భద్రతపై అనేక మంది ఆందోళన చెందుతున్నారు.

తాజా నిర్ణయానికి కొంతకాలపాటు గరిష్ఠ గడువు ఇచ్చినా, పరీక్ష పాస్ అయేంత వరకు ఒత్తిడి తొలగదు.నూతన విధానాల అమలులో నాన్?టెట్ టీచర్లకు ఇక వెసులుబాటు లేకుండా మారింది. ఎన్నాళ్లుగా డ్యూటీలో ఉన్నా టెట్ అర్హత తప్పదు. విద్యారంగంలో నాణ్యతను పెంపొందించేందుకు తీసుకుంటున్న ఈ మార్గం కొంతమందికి సవాళ్లను, మరికొంతమందికి నూతన అవకాశం కావచ్చు.

# నకిలీలు... మోసాలు...

**ఆర్మూరు,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వలసలు కాస్త తగ్గాయి. కానీ ఐదేళ్లుగా మళ్లీ విదేశాలకు వలసలు పెరుగుతున్నాయి. పల్లె, పట్టణ ప్రాంతాల్లోని ఎన్నో కుటుంబాలకి విదేశీ ఉద్యోగాలంటే గొప్ప ఆశ. స్థిరమైన ఉపాధి, మంచి జీతం, కుటుంబ జీవన ప్రమాణం మెరుగుండా మారుతుందని భావిస్తూ వేల మంది, ముఖ్యంగా గల్ఫ్ దేశాల వెలుపలికి వలస వెళుతున్నారు. నిరక్షరాస్యులు సాదాసీమ ఉద్యోగాలకు సిద్ధపడగా, విద్యావంతులు మెరుగైన అవకాశాల కోసం ప్రయత్నిస్తూ ఉంటున్నారు.విదేశీ మోజును కొందరు ఏజెంటు మోసాలకు పాల్పడుతున్నారు. విదేశాల్లో చోటుచేసే ఉద్యోగ అవకాశాల పేరిట డబ్బులు దండుకుని మోసం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేని సంస్థలు, వ్యక్తులు అక్రమ రీతిలో వలస అవకాశాలు కల్పిస్తున్నారని ప్రతీ ఏడాది కేసులు నమోదవుతున్నాయి. వేలాది మంది రూ. లక్ష నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించి విదేశాలకు వెళ్తున్నారు. అక్కడకు వెళ్లాక సరైన ఉద్యోగం లేక మోసపోతున్నారు.నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, నిర్మల్ జిల్లాలకి చెందిన చాలా మంది ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతున్నారు. విదేశాలలో ( జోర్డాన్, ఇజ్రాయెల్ సరిహద్దు) అసాధారణ పరిస్థితుల్లో ఉన్నారు. కొందరు ఏజెంట్లను సంప్రదించగా, 'మీరు అమ్ముడయ్యారు' అనే భయంకరమైన సమాధానం ఇచ్చారు. మూడు లక్షల రూపాయలకు పైగా అప్పులు చేసి విదేశాలకు వెళ్లడం తీరని మోసానికే నిదర్శనం.బాధితులకు కొంత మేర సాయం తోటి తెలుగువారూ, ఎన్నారై సంఘాలూ అందిస్తున్నాయి. కొందరు వారి ద్వారా తల్లిదండ్రుల వద్దకు తిరిగిరాగలుగుతున్నారు. కానీ పెద్దశాతం వలసదారులు విదేశాల్లో దుర్భర జీవితాన్ని కొనసాగే పరిస్థితి. దేశంలో విదేశీ వలసలు, మానవ వనరుల చట్టాల ప్రకారం కన్సల్టెన్సీలు రిజిస్టర్ అయి ఉండాలి. తెలంగాణలో మంజూరైనవి 160 ఉండగా, నకిలీ ఏజెంట్లు నాలుగు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. రెండేళ్లలో వలస మోసాల కేసుల్లో అనేకమంది అరెస్ట్ అయ్యారు.విదేశీ వలసల్లో తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు అక్రమ ఏజెన్సీల మోసాలు, గుర్తింపు ఉన్న సంస్థల కొరత, బాధితులకు వ్యవస్థబద్ధమైన సహాయం లేకపోవడం. మరింత ప్రభావవంతమైన ప్రభుత్వ చర్యలు, ప్రజలకు అవగాహన, చట్టసంబంధ సమాచారం అవసరమన్నది తాజా ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఆదినా మసీదుపై మరోమారు వివాదం

## యూసుఫ్ పఠాన్ పోస్ట్‌తో తిరిగి గందరగోళం

కోల్‌కతా: భారత మాజీ క్రికెటర్, తృణమూల్ కాంగ్రెస్ టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర రాజకీయ దుమారం రేపింది. మాల్దా జిల్లాలోని చారిత్రక అదినా మసీదుపై ఆయన చేసిన పోస్ట్‌తో పాత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ కట్టడం మసీదు కాదని, అది ఆదినాథ్ ఆలయం అని బిజెపి వాదిస్తోంది యూసుఫ్ పఠాన్, మాల్దాలోని అదినా మసీదును సందర్శించిన ఫొటోలను 'ఎక్స్' లో పంచుకున్నారు.

# ఏపీలో కొత్త పొత్తులు

విజయవాడ, : ఏపీలో కమ్యూనిస్టులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కడతారా? అందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారా? రెండువైపుల నుంచి చర్చలు మొదలయ్యాయా? రెండు వైపులా ఇది ఆవశ్యమా? పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం ఉంది. ఎన్డీఏలో తెలుగుదేశంతో పాటు జనసేన భాగస్వామ్య పక్షాలు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో బిజెపి ఉంది. వైసిపి ఒంటరి పోరాటం చేస్తోంది. జాతీయస్థాయిలో ఇండియా కూటమి లో కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో తటస్థ వైఖరి అనుసరిస్తోంది. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించి బిజెపి విషయంలో సానుకూలంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో ఒంటరి పోరాటం కంటే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడమే మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సిపిఎం జగన్ విషయంలో సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఉన్న మధు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత. ఆయన అసలు పేరు మధుసూదన్ రెడ్డి గా తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డికి బంధువు అవుతారని కూడా ప్రచారంలో ఉంది. జగన్మోహన్ రెడ్డి సీఎం గా ఉన్న సమయంలో మధు అనారోగ్యానికి గురైతే పరామర్శించారు. అటు తరువాత సిపిఎం అనుబంధ పత్రికకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున భారీగా ప్రకటనలు కూడా వచ్చాయి. దీంతో గత పదేళ్లుగా జగన్ విషయంలో సిపిఎం పెద్దగా సౌండ్ చేయలేదు. కానీ సిపిఐ మాత్రం గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా గట్టిగానే స్టేట్మెంట్లు ఇచ్చిందిమారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జగన్ పొత్తుల విషయంలో పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఒంటరి పోరాటం చేయడం సాహసమే. అందుకే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడం మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య ఎంపికయ్యారు. దీని వెనుక పొత్తు స్నేహం ఉన్నట్టు ప్రచారం సాగు తోంది. అయితే బిజెపికి జగన్ సానుకూలంగా ఉంటారు. ఇండియా కూటమికి వ్యతిరేకంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. అలాగే చంద్రబాబు పట్ల వామపక్షాలకు ఆ స్థాయిలో వ్యతిరేకతలేదు. కానీ ఇప్పుడు ఏపీలో రాజకీయ ఉనికి చాటుకోక తప్పదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ కంటే ఏపీలో వైసీపీ బలంగా ఉంది. అందుకే ఆ పార్టీతో స్నేహం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి వామపక్షాలు.ఇప్పటివరకు ఒంటరి పోరాటం అన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నినాదం. దమ్ముంటే ఒంటరిగా పోటీకి రండి అంటూ టిడిపి తో పాటు జనసేనకు సవాల్ విసురుతూ వస్తోంది వైసిపి. 2014, 2019 ఎన్నికల్లో ఇదే వామపక్షాలు ఉన్న జగన్ పట్టించు కోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వామపక్షాల ఉద్యమాన్ని అణచివేశారు జగన్. అడుగడుగునా వారిని అవమానించారు. అటువంటి వామపక్షాలు ఇప్పుడు జగన్తో జతకలుస్తాయి అన్నది అనుమానమే. అయితే ఇప్పుడు పొత్తు ఇరువర్గాలకు అనివార్యం. ఆపై కూటమి ప్రభుత్వం బలంగా ఉంది. అందుకే ఇప్పుడు ఆ రెండు పక్షాలు కలుస్తాయని ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# ఎంజీఎంలో ఏం జరుగుతోంది..?

వరంగల్: వైద్యులను ప్రాణదాతలు అని పిలుస్తుంటారు. కనిపించే దేవుళ్ళగా రోగులు కొలుస్తుంటారు. అటువంటి గొప్ప పేరు ఉన్న వైద్యులు రోగులకు చికిత్స అందించి.. ఇంకా మంచి పేరు తెచ్చుకోవాల్సి ఉండగా.. చికిత్సను పక్కనపెట్టి దోపిడికి పాల్పడుతున్నారు. అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడి ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల విభాగంలో అతిపెద్దదైన ఎంజీఎం లో అవినీతి వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల ఈ ఆసుపత్రిలో ఒకటే ఆక్సిజన్ సిలిండర్ ను ఇద్దరు చిన్నారులకు పెట్టడం చర్చకు దారి తీసింది. దీనిపై మీడియాలో ప్రముతంగా వార్తలు రావడంతో వైద్య శాఖ మంత్రి ఎంజీఎం పై చర్యలు తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే అందులో నిజం లేదని తర్వాత తేలింది.. ఇటీవల ఎంజీఎం లో రోగులపై సెక్యూరిటీ గార్డ్ లు దాడి చేశారు. ఆ దాడికి సంబంధించిన దృశ్యాలు కూడా మీడియాలో విపరీతంగా కనిపించాయి. ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడం.. మీడియాలో ప్రముఖంగా రావడంతో ఎంజీఎం సూపరిండెండెంట్ పై చర్యలు తీసుకున్నది.ఈ సంఘటన తర్వాత ఎంజిఎం లో ఓ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎంజీఎం లో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల రెండు కోట్ల నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణ వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా కావడంతోపాటు టెండర్లు వేయకుండానే స్టేషనరీ కొనుగోలు చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ వ్యవహారం ఆస్పత్రి వర్గాలలో చర్చకు దారితీస్తోంది. ఎంజీఎం లో పనిచేస్తున్న ఉన్నతాధికారుల్లో ఒకరు ఈ అవినీతి వ్యవహారాన్ని మీడియాకు లిక్ చేసినట్టు తెలుస్తోంది. ఓవర్గం ఎంజీఎంలో ఇష్టాను సారంగా ప్రవర్తిస్తోందని.. పై అండలు చూసుకుని అడ్డగోలుగా దోపిడీ చేస్తోందని



మరో వర్గం ఆరోపిస్తోంది. మరో వర్గానికి చెందిన ఉన్నతాధికారి మీడియాకు లింకులు ఇవ్వడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపడితే నిజాలు బయట పడతాయని తెలుస్తోంది. ఎంజీఎం కొత్త బాస్ దీనిపై దృష్టి పెడితే బాగుంటుందని రోగులు అంటున్నారు.ఇటీవల కాలంలో సెక్యూరిటీ గార్డులు కూడా రోగులపై దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెక్యూరిటీ గార్డులు పై అండదండలు తీసుకొని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని విమర్శలున్నాయి.. కొత్త బాస్ సెక్యూరిటీ గార్డుల వ్యవహార శైలి పట్ల దృష్టి సారించాలని.. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు. వైద్య సేవల విషయంలో పారదర్శకతను పెంపొందించాలని కోరుతున్నారు.

# దేశీయ తొలి ప్రైవేట్ రాకెట్..

## హైదరాబాదీ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అరుదైన ఘనత




హైదరాబాద్,: దేశంలో అంతరిక్ష్య ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్ ఇస్రో. అయితే భారతీయ అంతరిక్ష్య పరిశోధన సంస్థ (ఇస్రో)కున్న ఈ ఘనత ఇక ఎంతోకాలం కొనసాగకపోవచ్చు. అవును మరి. ఇస్రోను తక్కువ చేయడం కాదుగానీ.. హైదరాబాదీ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ ఓ వాణిజ్య రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతున్నది. భారత్‌లో ఈ తరహా తొలి ప్రైవేట్ రాకెట్ ఇదే కావడం విశేషం. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్.. స్కైరూట్ ఏరోస్పేస్ ఓఅరుదైన ఘనతను సాధించబోతున్నది. దేశంలోనే మొదటిసారి సొంతంగా ఓ వాణిజ్య రాకెట్‌ను తయారుచేసి ప్రయోగించబోతున్నది. వచ్చే 3 నెలల్లో ఈ భారత తొలి ప్రైవేట్, కమర్షియల్ రాకెట్ గగనతలంలోకి దూసుకుపోవచ్చని చెప్తున్నారు. ప్రస్తుతం దేశీయంగా భారతీయ అంతరిక్ష్య పరిశోధన సంస్థ (ఇస్రో) మాత్రమే ఈ తరహా ప్రయోగాలను చేస్తున్నది. అయితే ఇక స్కైరూట్ ఏరోస్పేస్ సైతం అందుకు వేదిక కాబోతుండటం గమనార్హం.

జనవరిలో..: ఇద్దరు మాజీ ఇస్రో శాస్త్రవేత్తల కంపెనీయే ఈ స్కైరూట్ ఏరోస్పేస్. వచ్చే ఏడాది జనవరిలో అంతరిక్ష్యంలోకి తమ తొలి పూర్తిస్థాయి శాటిలైట్ మిషన్‌ను పంపాలని స్కైరూట్ ప్రయత్నిస్తున్నది. దీంతో భారతీయ అంతరిక్ష్య పరిశోధనా రంగంలో ప్రైవేట్ భాగస్వా

**వాణిజ్య ప్రయోగానికి స్కైరూట్ సిద్ధం**

**భారత్‌లో ఇస్రో కాకుండా ఇతర సంస్థలకిదే మొదటిసారి**

మ్యానికి పునాదులు పడ్డట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, టీమ్‌సెక్, జీఐసీ వంటి ఇన్వెస్టర్లు ఈ ప్రాజెక్టు వెనుక ఉన్నారు. అయితే వచ్చే ఏడాది ప్రతీ 3 నెలలకోసారి ఒక ప్రయోగాన్ని చేపట్టాలని స్కైరూట్ యోచిస్తున్నది. ఈ క్రమంలోనే 2027కల్లా నెలకోసారి జరుపాలనుకుంటున్నామని చెప్తున్నది.

9 నెలలు.. 3 మిలియన్ డాలర్లు: ఒక్కో రాకెట్ నిర్మాణానికి దాదాపు 8–9 నెలల సమయం పడుతుందని, 2–3 మిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని స్కైరూట్ సీఈవో పవన్ చందన చెప్తున్నారు. దేశ, విదేశీ కస్టమర్ల పేలోడ్స్‌తో ఒక్కో ప్రయోగం ద్వారా సుమారు 5 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని అందుకోవచ్చనీ అంటున్నారు. ఇక ప్రపంచవ్యాప్తంగా చిన్నపాటి శాటిలైట్ల ప్రయోగాలకు డిమాండ్ పెరుగుతున్నదంటున్న స్కైరూట్.. తమ ప్రయోగాలతో ము న్ముందు భారత, అంతర్జాతీయ క్లయింట్లకు మరింత చౌకగా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చుతున్నది. 2018లో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను స్థాపించారు.

ఫండింగ్‌లో భాగంగా రూ.850 కోట్ల నిధులను ఈ కంపెనీ సమీకరించింది. 2022 నవంబర్‌లో తమ సబ్ఆర్బిటల్ వెహికిల్ విక్రమ్–ఎస్‌ను పరీక్షించడం ద్వారా ఓ రాకెట్‌ను లాంచ్ చేసిన తొలి ప్రైవేట్ భారతీయ సంస్థగా స్కైరూట్ గుర్తింపు పొందింది. ప్రస్తుతం ఇంజినీరింగ్, సరఫరాపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ సంస్థ.. 2028 మార్చి నాటికి లాభాల్లోకి అడుగుపెడుతామన్న ధీమాను కనబరుస్తున్నది. భారతీయ ప్రైవేట్ స్పేస్ ఇండస్ట్రీలో 200కుపైగా స్టార్టప్‌లు. 2033కల్లా ఈ రంగం విలువ 44 బిలియన్ డాలర్లకు చేరగలదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ అంచనా వేస్తున్నది.

# పదవీ విరమణ పొందిన కార్మికుని ఈ ఘన సన్మానం

కమాన్ పూర్: పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికునికి ఘన సన్మానం నిర్వహించారు. మోతుకూరి వెంకటేశ్వర్లు ఇ పి ఎలెక్ట్రిషన్ ఆర్.జి త్రీ పరిధిలోని ఓసిపి- 2,సింగరేణి కంపనీ లో సుదీర్ఘంగా 35 సంవత్సరాలు కార్మికునిగా పనిచేశారు. యాజమాన్యం ఆదేశాల మేరకు క్రమశిక్షణ, అంకిత భావంతో పని చేసి సింగరేణి కంపని అభివృద్ధి లో భాగస్వాములు కావడం జరిగింది.కాలి సమయములో తోటి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సేవా చేయడమే కాకుండ ఆధ్యాత్మికగా కూడా అనేక కార్యక్రమాలలో పాల్గొని అధికారులు,కార్మికులు మరియు సహచర సమీప కుటుంబాల మన్ననలు పొంది పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా సింగరేణి ఆల్ రిటైర్మెంట్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గౌతం శంకరయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతుకూరి వెంకటేశ్వర్లు భార్య పిల్లలతో కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని



ఆయన ఆ భగవంతుని వేడుకోవడం జరిగింది.ఇంకా ఈ కార్యక్రమంలో సింగరేణి ఆల్ రిటైర్మెంట్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాద్యకులు అధ్యక్షుడు వేగోలపు మల్లయ్య జాయింట్ సెక్రటరీ తోట మొండయ్య జనరల్ సెక్రటరీ పట్నం సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఒరుగులు.. పొడులు.. కోటి దాటి పరుగులు..



చిన్నప్పటి నుంచి ఆమె చదువుల్లో నేర్పరి. నిరంతరం పుస్తకాలతో దోస్తీ చేస్తూనే%ా% తన తండ్రి పడే కష్టాన్నీ గమనించింది. పండిన టమాటాలను ధర లేక పొలంలోనే వదిలేసిన తల్లిదండ్రుల దైన్యాన్నీ చూసింది. ఆ కష్టాలను మనసులోనే దాచుకొని.. ఉన్నతంగా చదువుకుంది. కార్పొరేట్ కొలువు సాధించింది. కానీ, ఆమెకు కావాల్సింది ఇది కాదు. అందుకే, ఉద్యోగాన్ని వదిలేసి స్టార్టప్ ప్రారంభించింది సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన ఓడపల్లి కీర్తిప్రియ. 2018లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పి.. కాయగూరలతో ఒరుగులు, పొడులు తయారు చేయడం మొదలుపెట్టింది. స్థానిక రైతులకు గిట్టుబాటు ధర ఇస్తూ, వినియోగదారులకు సేంద్రియ ఉత్పత్తులను అందిస్తున్న 'కోహ్ ఫుడ్స్' వ్యవస్థాపకురాలు కీర్తిప్రియ సక్సెస్ స్టోరీ ఇది..

కీర్తి ప్రియది సాధారణ మధ్యతరగతి కుటుంబం. ఆమె తండ్రి వెంకన్న కానిస్టేబుల్‌గా పనిచేసేవారు. సొంతూరులో ఆరెకరాల సాగుభూమిలో వ్యవసాయం చేసేవారు. వరితోపాటు కూరగాయలు వేసేవారు. కీర్తి తల్లి విజయలక్ష్మి వ్యవసాయం చూసుకునేది. కీర్తి కోదాడ, వరంగల్‌లో ఇంటర్ వరకు చదివింది. తర్వాత బిట్స్ పిలానీలో బీఫార్మసీ,ఐఐఎం కోల్‌కతాలో ఎంబీఏ పూర్తి చేసింది. మంచి ప్యాకేజీతో కార్పొరేట్ ఉద్యోగం సాధించింది.



మంచి ఉద్యోగం లభించినా.. తాను కోరుకున్న జీవితం ఇది కాదు అనిపించింది ఆమెకు. చిన్నప్పుడు సాగులో తన తండ్రికి ఎదురైన చేదు అనుభవాలు ఆమెను కుదురుగా ఉండనివ్వలేదు. టమాటాలకు ధర లేక కోత కోయకుండానే వదిలేసిన తండ్రి దుఃఖం ఆమెను వెంటాడింది. తాను చదువుకునే రోజుల్లో తల్లి పంపించిన ఒరుగులు, పొడులను గుర్తు చేసుకుంటూ వాటినే ఎందుకు తయారు చేయకూడదని ఆలోచన చేసింది. దాన్ని అమలు చేయడానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించింది కీర్తి.

కల సాకారం..: ఎంబీఏ చదివిన కీర్తికి వ్యాపార మెలకువలు కొట్టిన పిండి. ఆ ధైర్యంతోనే చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి 2018లో ఈ వ్యాపారం మొదలుపెట్టింది. తొలుత లక్ష రూపాయల వ్యయంతో సోలార్ డ్రయర్ కొనుగోలు చేసింది. తొలినాళ్లలో ఒడుదొడుకులు




ఎదురైనా కుటుంబం సహకారంతో నిలబడింది. అంచెలంచెలుగా ఎదిగి 2021లో నట్స్ అండ్ ఫీల్డ్స్ ఇండస్ట్రీ ఏర్పాటు చేసింది. 2022లో 'కోహ్ ఫుడ్స్' సంస్థను స్థాపించి సేంద్రియ పద్ధతుల్లో పండించిన రకరకాల పంటలతో ఒరుగులు, పొడులు, టీ పొడి తయారు చేస్తూ.. తన కలను సాకారం చేసుకున్నది.

మహిళలకు ఉపాధి: తొండ గ్రామానికి పదిహేను కిలోమీటర్ల పరిధిలోని రైతులను కలిసి ఎలాంటి ఎరువులు, మందులు వేయకుండా కూరగాయలు, ఆకు కూరలు సాగు చేసేలా ప్రోత్సహించింది కీర్తి. అలా రైతులు సాగు చేసిన పంటను బహిరంగ మార్కెట్ కన్నా ఎక్కువ ధర ఇచ్చి కొనుగోలు చేస్తుంది.

టమాటాలు, బీట్‌రూట్, క్యారెట్, బెండకాయలు, మునగ, పాలకూర ఇలా 15 రకాలను సేకరించి, వాటిని ఒరుగులుగా, పొడులుగా తయారు చేసి 'కోహ్ ఫుడ్స్' బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నది. అరటి పూతతో టీ పొడి తయారు చేస్తున్నది. కీర్తిప్రియ తన స్టార్టప్‌తో రైతులకు మేలు చేయడంతోపాటు 25 మంది మహిళలకు ప్రత్యక్షంగా ఉపాధి కల్పించింది.

ఎప్పట్నుంచో ఉన్నదే..: '2022లో 'కోహ్ ఫుడ్స్' ప్రొడక్షన్ ప్రారంభించాను. 20 లక్షల టర్నోవర్‌తో మొదలైన మా ప్రయాణం ఇప్పుడు కోటి రూపాయలకు చేరింది. ఈ ఏడాది రెండు కోట్లు టార్గెట్ పెట్టుకున్నాను. ఇది నా సొంత ఆలోచన కాదు. ఇప్పుడు మనం మర్చిపోయాం కానీ, సీజనల్ కాయగూరలతో ఒరుగులు పెట్టడం ఒకప్పుడు ఇంటింటా కనిపించేది. మా అమ్మ నాకు పంపిన ఒరుగులు, పొడులే నా ఆలోచనకు కారణమైంది. కోహ్ ఫుడ్స్ ద్వారా రైతులకు మద్దతుగా నిలవడం, మహిళలకు ఉపాధి కల్పించడం, వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందివ్వడం సంతృప్తినిస్తున్నది' అని చెబుతున్నది కీర్తి. ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్‌లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలనుకునే యువతకు కీర్తిప్రియ ఆదర్శమని చెప్పవచ్చు.




# ఇన్‌కమింగ్ కాల్స్‌లో పేరు డిస్‌ప్లే

## త్వరలో ప్రవేశపెట్టనున్న ట్రాయ్

న్యూఢిల్లీ, : మన మొబైల్‌కు ఎవరు ఫోన్ చేస్తున్నారో తెలుసుకోవాలంటే ట్రూ కాలర్ లాంటి థర్డ్ పార్టీ యాప్‌లపై ఆధారపడుతున్నాం. ఇకపై అలాంటి అవసరం లేకుండా, ఫోన్ కనెక్షన్ సమయంలో ఇచ్చిన ఐడీలోని పేరు ఇన్‌కమింగ్ కాల్స్ సమయంలో మొబైల్ స్క్రీన్‌పై కనిపించే సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు టెలికమ్యూ నికేషన్స్ శాఖ అందించిన ప్రతిపాదనలను టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఆమోదం తెలిపింది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఇది అందుబాటులోకి రానుంది. కాలింగ్ నేమ్ ప్రెజెం టేషన్ (సీఎన్‌ఏపీ)గా పేర్కొనే ఈ సర్వీస్ ద్వారా ఇకపై వినియోగ దారులు తమకు వచ్చే కాల్స్‌లో పారదర్శకత పొందుతారు. మనకు కాల్ చేసే వ్యక్తి ఆయా టెలికం ఆపరేటర్ వద్ద ఏ పేరుతో అయితే సిమ్ తీసుకున్నాడో ఆ పేరు మాత్రమే మనకు డిస్‌ప్లే అవుతుంది. దీని ద్వారా స్పామ్ కాల్స్ బెడద తప్పుతుంది. సీబీఐ, ఐటీ, పోలీస్, సీఐడీ వంటి పేర్లతో మోసపుచ్చే అవకాశం ఉండదు. వినియోగ దారులకు ఈ ఫీచర్ డిఫాల్ట్‌గా ప్రారంభమవుతుంది.

# సినిమా..

## రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రామాయణ




బాలీవుడ్ నుంచి మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లలో ఒకటి రామాయణ దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రం 45కి పైగా భాషల్లో విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించబోతుండగా.. సాయిపల్లవి సీత పాత్రలో నటిస్తుంది. రావణుడిగా కన్నడ స్టార్ హీరో యష్. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే తదితరులు నటించబోతు న్నారు. అయితే ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు నటుడు సన్నీడియోల్. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్ర పోషిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ రోల్ చాలా సరదాగా అల్లరిగా ఉండడంతో పాటు- ఉత్సహాంగా ఉంటుందని సన్నీ తెలిపాడు. నా పాత్రకు సంబంధించి త్వరలోనే షూటింగ్ ప్రారంభంకానుంది. ఇలాంటి పాత్రలు చాలా సవాలుతో కూడుకున్నవని అందులో పూర్తిగా లీనమై నటించాలని సన్నీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ అనుభూతిని పంచడానికి చిత్రబృందం నిరంతరం శ్రమిస్తోందని ఆయన తెలిపారు. హాలీవుడ్ సినిమాల స్థాయికి ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమాను రూపొందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రామాయణం లాంటి మహాకావ్యాన్ని ఎన్నిసార్లు తెరకెక్కించినా కొత్తగానే ఉంటుందని, ఈ సినిమాతో ప్రపంచమంతా రామాయణం గొప్పతనాన్ని మరోసారి తెలుసుకుంటుందని సన్నీ డియోల్ ధీమా వ్యక్తం చేశారు

## మహేష్-రాజమౌళి సినిమాలో సరికొత్త టెక్నాలజీ..?



దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. SSMB%29 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహేశ్ - రాజమౌళి కాంబోలో ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ని ఈ ఏడాది నవంబర్‌లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. గ్లోబ్ ట్రాటర్‌ని పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. అయితే ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి ఒక సాలిడ్ వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ సినిమాలో రాజమౌళి బ్లూ-స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొదట ఈ సినిమా షూటింగ్‌ను కెన్యాలోని నేషనల్ పార్క్‌లలో చేయాలని చిత్రబృందం ప్లాన్ చేసుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం రాజమౌళి కూడా అక్కడి లోకేషన్‌లను జల్లెడ పట్టి వచ్చాడు. అయితే ప్రస్తుతం కెన్యాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ ప్లాన్ మారినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం, రాజమౌళి కెన్యాకు బదులుగా టాంజానియాలోని సెరెంగెటి అడవుల్లో షూటింగ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఈ చిత్రంలో బ్లూ-స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఆఫ్రికా అడవులను గ్రాఫిక్స్ ద్వారా రూపొందించబోతున్నట్లు సమాచారం. అయితే ఈ రెండు విషయాలపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

## వెంకటరమణ నేపథ్యమంతా విశాఖ!



విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రానికి సన్నాహాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. వెంకీ-గురూజీ మార్క్ చిత్రంగా మలుస్తున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్ లో వెంకటేష్ కున్న ఇమేజ్ ఆధారంగానే త్రివిక్రమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనింగ్ కథను రాసినట్లు వినిపిస్తుంది. 'వెంకటరమణ' అనే టైటిల్ కూడా ఫిక్సైందని సమాచారం. ఈ కథ పూర్తిగా విశాఖపట్టణం నేపథ్యంలోనే సాగుతుందిట. విశాఖలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన ఓ 50 ఏళ్ల వ్యక్తి కథగా ఆవిష్కరిస్తున్నారట. కుటుంబ అనుబంధాల నేపథ్యానికి త్రివిక్రమ్ మార్క్ హాస్యాన్ని జోడించి సిద్దం చేసిన స్క్రిప్ట్ అని తెలిసింది. విశాఖ-అనకాపల్లి ప్రాంతాలతో తనకున్న అనుబంధాన్ని గురూజీ ఈ కథలో హైలైట్ చేయబోయ బోతున్నారట. త్రివిక్రమ్ అంటే బలమైన డైలాగులు...బంధాలు.. భావోద్వేగంతో కథను నడిపించ గల దిట్ట. ఇలాంటి కథలు రాయడం కొట్టిన పిండి. 'అతడు', ' అత్తారింటికి దారేది', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అఆ', 'అరవింద సమేత', 'అల వైకుంఠపురములో' లాంటి చిత్రాల్లో ఎమోషన్ పాతతే అయినా తనదైన ట్రీట్ మెంట్ తో రక్తి కట్టించారు.

## మీనాక్షి చౌదరి అందాల మాయ

గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్ డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్. కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటోషూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి.



## పెళ్లి ఎప్పుడో చెప్పిన జాన్వీ కపూర్..!

అలనాటి అందాల తార శ్రీదేవి తనయ, బాలీవుడ్ బ్యూటీ జాహ్నవి కపూర్ ఎట్టకేలకు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఊహాగానాలపై స్పంచిందింది. శిఖర్‌పహారియాతో పెళ్లి వార్తలు తెగహల్‌చల్ చేస్తున్న వేళ.. ఈ వార్తలన్నింటికి చెక్ పెట్టింది. పెళ్లికి ఇంకా సమయం ఉందని.. ప్రస్తుతం తన దృష్టి అంతా నటనపైనే ఉందని స్పష్టం చేసింది. ఇటీవల ముంబయిలో జరిగిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సందర్భంగా జాన్వీ మీడియాతో మాట్లాడింది. ఈ సందర్భంగా 'మీ పెళ్లి ఎప్పుడు ' అనే ప్రశ్న ఎదురైంది. దీనికి జాన్వీ స్పందిస్తూ.. 'ఇప్పుడంతా నా కెరీర్ మీదే ఫోకస్ ఉంది. పెళ్లికి సమయం ఉంది' అంటూ బదులిచ్చింది. అయితే,శిఖర్ పహారియాతో జాన్వీ రిలేషన్‌లో ఉన్నట్లుగా గతకొంత కాలంగా వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే మనవడు శిఖర్‌తో జాన్వీ పలు ఈవెంట్లకు కలిసి రావడం, ఆమెఫోన్ స్పీడ్ డయల్‌లో శిఖర్ పేరు ఉండడం, 'శిఖు' పేరుతో ఉన్న నెక్లెస్ ఆమె ధరించడంతో ప్రస్తుతం ఇద్దరు రిలేషన్‌లో ఉన్నారని.. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని వార్తలు వచ్చాయి. ఈ తాజా ఈవెంట్‌లో శిఖర్ పేరును ప్రస్తావించకపోయినా.. పెళ్లి వార్తలపై జాన్వీఓక్లియర్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఇదే తొలిసారి. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' సినిమాలో జాన్వీ వరుణ్‌ధావన్‌తో కలిసి నటిస్తున్నది. ఈ సినిమా అక్టోబర్2న థియేటర్లలో విడుదల కానుంది. అలాగే, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తోతెలుగులో 'పెద్ది' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే.



## మృణాల్ బ్యూటీ సీక్రెట్ ఇదే..!




'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్. అభినయంతో పాటు సహజ సౌందర్యంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నది. చాలామంది బయటకు వచ్చిన సందర్భాల్లో మేకప్ లుక్‌లో కనిపిస్తుంటారు. కానీ, వారికి భిన్నంగా మృణాల్ మాత్రం నేచురల్‌గానే కనిపిస్తుంది. ఈ బ్యూటీ చర్మం ఎప్పుడూ కాంతివంతంగానే మెరుస్తూ ఉంటుంది. అయితే, తన బ్యూటీ సీక్రెట్‌ను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో షేర్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో మృణాల్ తాను రాత్రి పడుకునే ముందు ముఖానికి ఓ ఆయిల్‌ను అప్లయ్ చేసుకుంటానని చెప్పింది. ఆ ఆయిల్ వాడటాన్ని తన తల్లి సలహాతోనే ప్రారంభించానని చెప్పింది. అదే విషయాన్ని తల్లిని అడిగి మరింత వివరించాలన కోరింది. ఇంతకీ ఆ నూనే ఖరీదైన దేమీ కాదు. అందరూ వినియోగించే బాదం నూనే అని చెప్పింది. తన తల్లి సూచించిన ఈ చిట్కా తన చర్మానికి విశేషమైన కాంతిని ఇస్తుందని మృణాల్ చెప్పుకొచ్చింది. బాదం నూనెలో విటమిన్-ఈ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు, ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది సహజ మాయిశ్చరైజర్‌లా పని చేస్తుంది. అంతేకాక, యాంటీ-ఏజింగ్ లక్షణాలు ఉండటం వల్ల చర్మం యువకంగా కనిపించడానికి తోడ్పడుతుంది. వయస్సు ప్రభావాలు తొందరగా కనిపించకుండా అడ్డుకుంటుంది. ఇక కళ్ల కింద కనిపించే నలుపు వలయాలు, చర్మం ఉబ్బినట్లు కనిపించే సమస్యలకు కూడా బాదం నూనె సమర్థంగా పని చేస్తుంది. ఆ భాగంలో మృదువుగా మసాజ్ చేయడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయని సౌందర్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృణాల్ ఖరీదైన కొనుగోలు చేయడం ఏమాత్రం నచ్చదట. ఖరీదైన బట్టలు కొనుగోలు చేసినా వాటితో ఎలాంటి ఉపయోగం లేకుండా దాచి ఉంచాల్సి వస్తుందని అభిప్రాయపడింది.

ఇప్పటి వరకు తాను కొనుగోలు చేసిన ఖరీదైన డ్రెస్ రూ. 2వేలు మాత్రమేనని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. స్టార్ హీరోయిన్ అయినా తక్కువ ధరల్లోనే డ్రెస్‌లు కొనుగోలు చేస్తానని చెప్పడంతో అందరూ షాక్ అవుతున్నారు. మృణాల్ ఠాకూర్ మూవీ ఈవెంట్స్, ఇతర ఫంక్షన్లకు హాజరైన సందర్భంలోనే ఖరీదైన వస్త్రాలను ధరిస్తుండగా.. వాటిని రెంట్ తీసుకొని ధరిస్తుందట.

భారీ ధర దుస్తులను కొనుగోలు చేయడం నచ్చదని.. బదులుగా ఆ డబ్బులను ఫుడ్, ప్రాపర్టీస్ కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తానని చెప్పడం విశేషం. మృణాల్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మృణాల్ మరాఠి కుటుంబంలో పుట్టి పెరిగింది. 2012 ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. కెరియర్ ప్రారంభంలో టీవీల్లో నటించింది.

## ఓవర్ నైట్ స్టార్ గా తేజ...

తేజ సజ్జ హీరో గా నటించిన 'మిరాయ్' చిత్రం రీసెంట్ గానే భారీ అంచనాల నడుమ విడుదలై బాక్స్ ఆఫీస్ వద్ద అద్భుతాలను నెలకొల్పుతూ ముందుకు దూసుకుపోతుంది. నిర్మాతలు చెప్తున్నా లెక్కల ప్రకారం ఈ సినిమాకు రెండు రోజుల్లో వరల్డ్ వైడ్ గా 55 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లు వచ్చాయి. సాధారణంగా ఏ సినిమా నిర్మాత అయినా వచ్చిన డబ్బులకంటే ఎక్కువ డబ్బులు వచ్చినట్టుగా పోస్టర్స్ లో వేసి చూపిస్తుంటారు. కానీ మిరాయ్ నిర్మాతలు అలా చేయడం లేదు.ఎంత కలెక్షన్స్ అయితే వచ్చాయో, అంతే పోస్టర్స్ లో వేసే ప్రయత్నం చేశారు. 55 కోట్ల రూపాయిల గ్రాస్ అని చెప్పారు కానీ, ట్రేడ్ విశ్లేషకులు అందిస్తున్న లెక్కల ప్రకారం చూస్తే ఈ చిత్రానికి రెండు రోజుల్లో వచ్చింది 53 కోట్ల రూపాయిలు మాత్రమే. కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం మొదటిరోజు కంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయని అంటున్నారు.ట్రేడ్ పండితులు అందిస్తున్న సమాచారం ప్రకారం ఈ చిత్రానికి రెండవ రోజున 8 కోట్ల 20 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయట. ఈ ఏడాది భారీ అంచనాల నడుమ విడుదలైన రామ్ చరణ్ గేమ్ చేంజర్, పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రాలకు కూడా ఈ రేంజ్ షేర్ వసూళ్లు రాకపోవడం గమనార్హం. మూడవ రోజు అయితే రెండవ రోజు కంటే అద్భుతమైన ఆక్యుపెన్సీలు నమోదు అవుతున్నాయట. ప్రస్తుతం ఉన్న ట్రెండ్ ప్రకారం చూస్తే ఈ చిత్రం కచ్చితంగా రెండవ రోజు కంటే ఎక్కువ వసూళ్లను రాబట్టే అవకాశం ఉందని అంటున్నారు. హిందీ లో కూడా రెండవ రోజున ఈ చిత్రానికి 3 కోట్ల 50 లక్షల రూపాయిల నెట్ వసూళ్లను రాబట్టింది.



గ్రాస్ వసూళ్లు దాదాపుగా 5 కోట్ల రూపాయిల వరకు ఉండొచ్చు. ఓవర్సీస్‌లో కూడా రెండవ రోజున ఈచిత్రం హాఫ్ మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్టు సమాచారం.ఓవరాల్ గా చూస్తే రెండవ రోజున ఈచిత్రానికి 27కోట్ల రూపాయిల వరకు గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంటున్నారు. 30కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వస్తాయట. అలా ఓవరాల్ గా ఈ చిత్రం మూడు రోజుల్లో 85 కోట్ల రూపాయలకు పైగాగ్రాస్ వసూళ్లను రాబట్టే సూచనలు కనిపిస్తున్నాయని, బ్రేక్ ఈవెన్ మార్కుని కూడా అవలీల గా దాటిందని అంటున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215